సాంఘిక, ఆర్థిక విప్లవాలు బొమ్మా బొరుసు వంటివి.

హేతువాది

నాస్తికోద్యమ మాసపత్రిక

డిశంబర్ 2001 వెల : 5/-

దేశ భాషలందు తెలుగు లెస్స
తూర్పు వారి ఇటాలియన్ భాష తెలుగు

మమ్మీ, డాడీ చదువులు వద్దు. అమ్మా, అయ్యా చదువులె ముద్దు.
మాతా, పితా అననే వద్దు. అమ్మా, నాన్నా భలే ముద్దు.

ఇంగ్లీషు మాధ్యమికాన్ని వీడండి.
తల్లి బాసలో చదవండి.

సంస్కృత భాషలో చదవద్దండి.
మాతృభాషలో నేర్వండి.

తెలుగు తల్లికి గుండె కుంపటి దించండి.
తెలుగు భాషను కాపాడండి.

తెలుగు పుడమిని ఎడారిగా మార్చకండి.
తెలుగు భాషను వదలకండి.

తెలుగును తెగడకండి, ఆ తెగులు మానండి.

ప్రచురణకర్త, వివరాలకు :
వి. రామకృష్ణ,
చార్వాకాశ్రమం, నిడమర్రు (Po),
మంగళగిరి (మం॥), గుంటూరు జిల్లా.

ఇట్లు
తెలుగు భాషా పరిరక్షణ సమితి

C.I

చార్వాకం

గౌరవ సంపాదకులు :

బి. రామకృష్ణ.

ప్రధాన సంపాదకులు :

కె. అయ్యన్న.

సంపాదక వర్గం :

K. సుదర్శన్ (అడ్వొకేట్)
R. యాకోబు.
జార్జి.
D. హరిబాబు.

T. వెంకట్రాయుడు.
శ్రీరాపు శ్రీనివాసరావు.
విజయ కోటేశ్వరరావు.
కొల్లా వెంకటేశ్వర్లు.

జీవిత చందా : 600/-

విశిష్ట చందా : 150/-

సం॥ చందా : 60/-

చందాలు పంపవలసిన అడ్రసు :

బి. చార్వాకుడు.
C/o చార్వాకాశ్రమం
నిడమర్రు (P.O)
మంగళగిరి మండలం
గుంటూరు జిల్లా- 522503.

రచనలు పంపవలసిన చిరునామా :

బి. రామకృష్ణ
చార్వాకాశ్రమం
నిడమర్రు (P.o)
మంగళగిరి మండలం
గుంటూరు జిల్లా- 522503.

నాస్తిక సాహిత్యానికి రాయండి

చార్వాక బుక్ హౌస్
చార్వాకాశ్రమం
నిడమర్రు (P.O)
మంగళగిరి మండలం
గుంటూరు జిలా
522503

సమ్పాదకీయమ్ :

తాత్త్విక,సాంస్కృతిక పునర్వికాసం జరగాలి

సోదరులారా! దేశంలో సాంస్కృతిక పునర్వికాసం జరగాలి. ఒక్క సాంస్కృతిక రంగంలోనే గాక, దేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక, తాత్త్విక, సాహితీ రంగాలలో కూడా పునర్వికాసోద్యమం జరగాలి. అప్పుడే దేశం పూర్వపు ఔన్నత్యాన్ని అసమానతలు లేని ప్రజాతంత్ర వ్యవస్థను రూపొందించుకొంటుంది.

పూర్వపు ఔన్నత్యాన్ని పొందటమంటే, పాతదాన్ని తిరిగి నిలబెట్టమని అర్థం కాదు- అట్లా అని అపోహపడరాదు. అసమానతలు లేని సమసమాజాన్ని నిర్మించటమని భావించాలి.

సంస్కృతి అంటే ఏమిటి ?

ప్రపంచంలోని విజ్ఞానవేత్తలు ఎవరెన్ని రకాలుగా చెప్పినా, సంస్కృతి అంటే, అంతరంగిక జీవనం అని అర్థంచేసుకోవాలి. సంస్కృతి గాక, నాగరికత అనే పదం కూడా ఇంకోటి వుంది. నాగరికత అంటే, వ్యక్తి బాహ్య జీవన విధానమని అర్థం.

నాగరికత, శీతోష్ణస్థితులకు, భౌగోళిక ప్రభావాలకు లొంగుతుంది. మారుతుంది. సంస్కృతి అట్లా గాదు-

పునర్వికాసమంటే ఏమిటి ?

ఇదివరకున్న దానిని తిరిగి వికసింపజేయటం అంటే, ఒకనాడు మహోజ్జ్వలంగా వెలిగిన దేశీయ వ్యవస్థను ఇతరులు దుంపనాశనం చేశారు. ఇందులో సందేహానికి అవకాశమే లేదు. మన దేశంలోకి దాదాపు నాలుగైదు వేల సంవత్సరాల నాడు ఆర్యులు అనే సంచారజాతి ప్రవేశించిందనేది వాస్తవం. ఆర్యులీ నేలలోనే పుట్టారనీ, బయట నుంచి రాలేదని బూకరించే మాటలు కల్పితాలు. అవన్నీ కట్టుకథలు.

ఆర్యులు బయట నుంచి వచ్చారని చెప్పటానికి బ్రాహ్మణీయ సాహిత్యమే ప్రబల సాక్ష్యం.

మన మీద భౌతిక దురాక్రమణే గాక, బౌద్ధిక దురాక్రమణ కూడా జరిగింది. కాబట్టే, మన సర్వస్వం పరాయీకరణం చెందింది. బ్రాహ్మణీకరణం చెందింది. సంస్కృతీకరణం చెందింది.

ప్రస్తుతం సంస్కృతీకరణ చెందిన మనం, బ్రాహ్మణీయ భావజాలం మనదనే భ్రమలో మునిగివున్నాం. అందుకే వ్యజేతలైన సోదరులు కూడా ఆ వూబిలో దిగబడి; అదే మనదనే భ్రాంతిలో వున్నారు. మాట్లాడుతున్నారు. ఇది మనది కాదు అంటే, కస్సుమనే స్థితిలో వున్నారు

కాబట్టే మనం మన దేశీయతను తిరిగి నిలుపుకోవాలి. నేటి హిందూ ధర్మం మన ధర్మం గాదు. ఇదంతా విదేశీ ధర్మం. దీన్ని తప్పకుండా మనం పోరాడి మనదేశం నుండి తన్ని తరిమేయవలసిన అవసరం వున్నది.

దేశంలో పునర్వికాసోద్యమం జరిగిందా ?

మనదేశంలో పునర్వికాసోద్యమం ఇంతవరకు జరుగలేదు. ఐరోపా ఖండంలో జరిగింది. అందుకే వాళ్లు అభివృద్ధిపథంలో వున్నారు. మనకూ చదువూ, సంస్కారమూ, స్వేచ్ఛ ఇట్లాంటివేమీ లేకుండా బ్రాహ్మణీయ భావజాలం చేసింది. మనకు వికాసం లేదు. కాబట్టే ఈ దేశంలో ఇప్పటి వరకూ పునర్వికాసోద్యమం రాలేదు.

పరాయి భావ పంకంలో కూరుకుపోయి, దానినే మన దేశీయ భావజాలంగా నమ్ముతున్న మనం పునర్వికాసోద్యమానికి నడుంకట్టలేక పోయాం. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఇకనైనా పరాయీకరణకు అంచే బ్రాహ్మణీయ వ్యవస్థ భావజాలానికి అంతం పలుకుదాం. అసలైన స్వాతంత్ర్య పోరాటానికి పిలుపునిద్దాం. రంగంలోకి దూకుదాం. బద్ధకంకణు లౌదాం.

దేశీయతను చాటవద్దా

మనం మన దేశీయతను చాటుకొందాం మరుగునపడ్డ మన వారసత్వ సంపదను పునరుద్ధరించుకొందాం. అన్నిరంగాల్లో మనం ఎవరికీ తీసిపోనంత నాగరికులం.

తాత్త్విక, సాంస్కృతిక, సామాజిక, సాహితీ, రాజకీయ, ఆర్థిక మొ॥న

రంగాలలో మనల్ని పరాయీకరణకు అంటే బ్రాహ్మణీకరణకు గురి చేశారు దాని నుంచి బయటపడి దేశీయతను పునరుద్ధరించు కోవలసిన తరుణ మాసన్నమైంది. మన ముందు తక్షణ కర్తవ్యంగా నిలబడ్డది.

దేశీయత పేరుతో నేటి పాలకవర్గాలు ప్రచారం చేస్తున్నదంతా దగా, మోసం బూటకం దేశీయత పదానికే అర్థం లేదు. విదేశీయులైన నేటి హైందవులు అంటే, బ్రాహ్మణీయ వ్యవస్థ పోషకులు చెప్పే అబద్ధాలను మనం నమ్మాలా? ఇంతవరకూ నమ్మి మన దేశీయతనూ, జాతీయతనూ, మన సర్వస్వాన్నీ కోల్పోయాం, అందుకే మనల్ని మనం మరచిపోయాం. ఎదుగూ బొదుగూ లేని పొట్టివాళ్ళుగా అంటే మరగుజ్జు వాళ్లుగా మిగిలాం. మన భవిష్యత్తునే మనం మరచిపోయాం.

ద్విజులు- అంటే, ఆర్యులు మూడు వర్ణాలనీ, మనం దేశీయులమంతా ఒకే వర్ణమనీ, పై మూడు వర్ణాల వారికీ సేవ చేయటమే మన విధి అనీ వాళ్ళ స్మృతుల నిండా రాశారు. ఒకే తప్పు చేసిన ఆర్యుడికి ఒక రకమైన దండన, దేశీయుడి కొక రకమైన దండన. దేశీయుడే అవయవంతో తప్పు చేస్తే దానిని ఖండించాలి. ఆర్యుడు ఎంత తప్పు చేసినా, మహా అయితే గ్రామ బహిష్కారం మాత్రం దండన. చూశారా! మనకూ, ఆర్యులకూ ఎంత తేడా వుందో? దీన్ని మనం అర్థంచేసుకోవాలి.

ఆర్యులీ దేశం వాళ్ళు కాదని చెప్పటానికి ఇంతకంటే సాక్ష్యం ఏం కావాలి?

మనం భారతీయులమా ?

ఈ మాట రాస్తున్నందుకు ఎవరికీ కోపం రానవసరం లేదు. నిజంగానే మనం భారతీయులం గాదు. నాగులం. మనదేశం భారతదేశం గాదు. నాగదేశం. మన భూమి భారత భూమి గాదు, నాగ భూమి.

విశ్వహిందూ పరిషత్ ప్రపంచాధ్యక్షులు, దేశీయులైన క్రైస్తవ, మహమ్మదీయ సోదరుల్ని భారతీయీకరణం చేస్తామంటున్నారు లేకపోతే ఈ దేశం నుండి వెళ్ళిపోవాలట!

భారతదేశమనే పేరు ఆర్యులు రాకముందు లేదు. ఆర్యులే ఈ దేశానికి భారత దేశమనే పేరు పెట్టారు. ఆర్యుల్లో భరత గణం అనే బలమైన గణం వుంది. దానివల్ల ఈ దేశానికి భారతదేశమనే పేరు వచ్చింది.

అంతేకాని, శకుంతలా దుష్యంతుల సంతానం భరతుడు పాలించటం వల్ల ఈ దేశానికి పేరు రాలేదు. జడభరతుడి వల్ల గానీ, రాముని తమ్ముడు భరతుడి వల్ల గానీ ఈ దేశానికి పేరు రాలేదు. ఇంకా ఏ భరతుడి వల్లా ఈ పేరు రాలేదు. ఇది చారిత్రక నగ్న సత్యం.

ఆర్యులు ఎంత ముందుకుపోయి లెక్కవేసినా నాలుగైదు వేల సంవత్సరాల కు ముందు వచ్చిన దాఖలాలు లేవు. ఆర్యులీ దేశానికి రాకముందు మనకు పట్టణ నాగరికత వుంది. హరప్పా, మొహంజదారో ఇతర గుజరాత్ ప్రాంతంలో దొరికిన శిథిలాలూ, తుంగభద్రానదీ లోయ నాగరికతా దీన్ని తెలియజేస్తున్నాయి.

ఆర్యుల కంటె ముందే మనం వున్నాం. పట్టణ నాగరికత మనకున్నది. మనం నాగరికులం. అనాగరికులైన ఆర్యులీ నేలపై అడుగుపెట్టకముందే సుసంపన్న మైన నాగరికత ఈ దేశంలో వుందని దాఖలాలు చాలా వున్నాయి. దాన్నంతా మనం మరచిపోయాం. మరచిపోయేట్టు చేయగలిగారు

ఆర్యులీ దేశానికి రాకముందు మన దేశానికి పేరేమిటి? మన ఆచార వ్యవహా రాలు, మన సంస్కృతి, మన పాడిపంటలు ఏమిటి? రాజకీయ, ఆర్థిక వ్యవస్థ ఏమి టి? మొ॥న ప్రశ్నలు వేసుకోవాలి. సమాధానాలు వెతుక్కోవాలి

అసలు మన చరిత్రను మనం రాసుకొన్నామా?

ఆర్య సాహిత్యం మనది గాదు

ఆర్య సాహిత్యంగా మనం చెప్పుకొనే సాహిత్యమేదీ మనది గాదు వేదాలూ, ఉపనిషత్తులూ బ్రాహ్మణాలూ, ఆరణ్యకాలూ, పురాణాలూ, ఇతిహాసాలూ, కావ్యాలూ ఏవీ మనవి కావు. స్మృతులూ, ధర్మసూత్రాలూ ఇవి కూడా మనవి కావు.

మనవి కాకపోవటమే గాదు, మనల్ని అంటే దేశీయుల్ని వాళ్ళ సాహిత్యం నిండా రాక్షసులుగా, అవినీతిపరులుగా, వికృతాకారులుగా, నానా రకాల భ్రష్టులుగా చిత్రించి ప్రచారం చేశారు. మనల్ని తిట్టిన, మనల్ని క్రూరంగా చిత్రించిన, మన ల్ని చదువరాదని ఆంక్షలు విధించిన సాహిత్యం మనదెట్లా అవుతుంది? మనదని చెప్పుకోవటానికి ఆధారాలేమిటి?

మనదేశం రాకముందు ఆర్యులకు లిపే లేదు అంటే అక్షరాలు లేవన్నమాట అందుకే వేదాల్ని శ్రుతులన్నారు. వాళ్ళు దీనికి కారణం వేరు చెప్పినా, పవిత్ర

తను ఎంతగానో అంటగట్టినా, అపౌరుషేయాలని అపాదించినా అంతా మేకపోతు గాంభీర్యమే.

లిపి లేకుండా వచ్చిన సందార జాతి. అందుకే చెవులతో వినే వారు. శ్రుతి అంటే అర్థం అదే. అంతకంటే వేరే అర్థం చెప్పటం కూడా అనర్థహేతువే.

దేశీయ సాహిత్యాన్ని ఆర్యులు అంటే బ్రాహ్మణీయ వ్యవస్థా రక్షకులు ధ్వంసం చేశారు. ఎంతో నాగరికత, ప్రాచీనత, లిపి వున్న భాషలే దేశీయమైనవి. అంత ఎందుకు? తెలుగే సంస్కృత భాష కన్నా చాలా ప్రాచీనమైనది. దీనికి కావలసిన ఋజువులు కూడా వున్నాయి.

మన దేశీయ సాహిత్యాన్నీ, మన సర్వస్వాన్నీ దుంపనాశనం చేసిన ఆర్య జాతి చాలా కఠోరమైంది. అంటే బ్రాహ్మణీయవ్యవస్థ చాలా క్రూరమైందన్న మాట.

వేదాల సంగతి అటుంచినా, రామాయణం కూడా దేశీయుడు చదువరాదని శాసనం చేశారు. అట్లాంటి అపవిత్ర, దోషభూయిష్టమైన గ్రంధాలు, అవతార పురుషులు మనకెందుకు?

అందుకే మన మధ్య, మన సాహిత్యంగా చెలామణీ అవుతున్న ఏ ఆర్య మత గ్రంధాన్నీ మనం చదువరాదు. వుండనీయరాదు. దేశీయ సాహిత్యాన్ని రాసుకొందాం. చదువుకొందాం.

ఆర్య నాగరికత మనది గాదు

దేశీయ నాగరికతకు, ఆర్య నాగరికతకు సంబంధము లేదు. ఇప్పుడు భారత నాగరికత అనేది మనది గాదు. ఆది హైందవ నాగరికత. మనం నేటి హైందవులం కాము.

మనది స్త్రీని గౌరవించే, స్త్రీకి స్వాతంత్ర్య మిచ్చిన మాతృస్వామిక నాగరికత.

ఆర్యులది మగవాడికి ప్రాధాన్యమిచ్చిన పితృస్వామిక నాగరికత.

మాతృస్వామికం, పితృస్వామికం అనే పదాలు కేవలం కల్పితాలని కొందరు దబాయిస్తారు. అది కేవలం దబాయింపు మాత్రమే.

మనది మాతృస్వామిక వ్యవస్థ ఆడమనిషికి ప్రాధాన్య మిచ్చిన వ్య వ స్థ.

ఆర్యుల దాడితో బౌద్ధికదురాక్రమణ జరిగి మన నాగరికత కనుమరుగైంది. దానిని తిరిగి నిలబెట్టుకోవలసిన అవసరం, పరాయివాళ్ళను పంపవలసిన అవసరం ఈనాడే ఏర్పడ్డది. దీనికోసం ఏమైనా పణంగా ఒడ్డవలసిందే.

దేశ స్వాతంత్ర్యానికి ఉద్యమించుదాం!

1947 వచ్చింది స్వాతంత్ర్యం అంటారు గాని, కాదు కేవలం అది అధికార మార్పిడి. ఈ సత్యాన్ని మనం గమనించాలి.

ఈ దేశం మీదకి ఆర్యులు 4, 5 వేల సం॥ల నాడు వచ్చారు. దేశీయుల్ని కబళించారు. మనం ఆనాడే స్వాతంత్ర్యాన్ని కోల్పోయాం. బ్రిటీషు వాడు వచ్చిన తరువాత అస్వతంత్రులమయ్యామని చెప్పటం అబద్ధం. ఆర్యుల రాకతోటే మనం బానిసలమయ్యాం. ఇప్పటికీ మనం ఆర్య భావ బానిసలం. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, బ్రాహ్మణీయ భావజాల బానిసలం. ఈ భావజాలం, ఈ నిచ్చెనమెట్ల సామాజిక వ్యవస్థ కూల్చకుండా మనం స్వాతంత్ర్యాన్ని అనుభవించలేం.

ఆనాటి నుండి నేటి వరకు ఆర్యేతరులం, ద్విజేతరులం అరు బయట జైళ్ళల్లో మగ్గుతున్నాం.

బ్రాహ్మణత్వాన్ని భుజాన వేసుకొని మోస్తున్న కొంతమంది ద్విజేతరులకీ విషయం అనుభవంలో వుండకపోవచ్చు, వాళ్ళంతా నయా బ్రాహ్మణత్వ ప్రచారకులే.

కాబట్టే మనం మన దేశీయతను బ్రాహ్మణ భావజాల శృంఖలాల నుండి, ఆ బంధాల నుండి విముక్తం చేయాలి. దీనికి ద్విజేతరులంతా కదలిరావాలి. కలిసికట్టుగా చేయిచేయి కలిపి ముందుకు సాగాలి.

మనలో మనకు చాలా అభిప్రాయ భేదాలుండవచ్చు. వుంటాయి కూడా. కాని ఈ విషయంలో ఆలోచించి కదంత్రొక్కుతూ పరుగెయ్యాలి.

కర్తవ్యం :

అంతా పరాయివాళ్ళ కప్పజెప్పిన మనం, వాళ్ళ చేత దద్దమ్మలుగా చేయబడ్డ మనం, సంస్కృతీకరణకు లోనైన మనం, బ్రాహ్మణీయ వ్యవస్థ పంకంలో కూరుకుపోయిన మనం చేయవలసిన పని చాలా వుంది.

కేవలం ఆర్థిక, రాజకీయ ఉద్యమాలు చేపట్టినంత మాత్రాన ఏమీ ఒరగదు, ఆర్థిక, రాజకీయాలు మనం కోరుకొనే నూతన వ్యవస్థా వృక్షానికి రెండు పండ్లు మాత్రమే. ఆ చెట్టుకు పండిన పంట మొత్తం అదే గాదు. మిత్రులీ విషయాన్ని గమనించాలి. కాబట్టే ఇతర తాత్త్వికాది రంగాలలో మనం చేయవలసిన పని చాలా వుందని చెప్పటం,

ము ఖ్యం గా :

1. అర్.ఎస్.ఎస్. (రాష్ట్రీయ స్వయం సేవక సంఘం)కు దేశీయ వ్యవస్థను ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేయాలి. దేశీయ ద్విజేతరులంతా అన్నిరకాల సహకారం అందించాలి. యువతీ యువకులు ఈ నిర్మాణంలో ముందు భాగాన నిలబడాలి.

2. విద్యా సంస్థలు, ప్రచార కేంద్రాలను స్థాపించాలి.

3. మన చరిత్ర మనం రాసుకోవాలి. పురాణాలలో చిత్రించిన దేశీయ వీరుల గాథల్ని తిరిగి రాయాలి మనం చదువుకోవాలి. ప్రచారం చేయాలి

4. దేశీయుల్ని అనార్యులుగ, అటవికులుగ, అనాగరికులుగా, అధర్మపరులుగా చిత్రించిన బ్రాహ్మణీయ సాహిత్యాన్ని నాశనం చేయాలి వాటిని చదవటం మానిపించాలి. మానాలి,

5. మనకూ, ద్విజులకూ ఎంతో పక్షపాతంగా వున్న చట్టాలను దుంపనాశనం చేయాలి. మన జనాన్ని జాగృతం చేసి, వాటిని మనకు పనికిరానివని చెప్పి తగులబెట్టాలి.

6. మన సంస్కృతిని తిరిగి నిర్మించుకోవాలి. బ్రాహ్మణీయ భావజుష్టమైన అనాగరికులైన ఆర్యుల వంచనకు పాత్రమైన మన తాత్త్విక భాండాగారాల్ని తిరిగి మన వాటినిగా రాసుకోవాలి.

7. మనదేశం పేరు గూడా భారతదేశమని గాక, మన దేశీయతను చాటే "[illegible] దేశం" అని పెట్టుకొంటే మంచిది. మహాత్మా జ్యోతిరావుపులే దేశం పేరు మార్చాలని చెప్పి, దీన్ని బలి దేశమంటే బాగుంటుందంటున్నారు దేశీయులైన మేధావులు ఈ విషయం ఆలోచించాలి.

8. దేశీయ వీరుల్ని కీర్తిస్తూ, ఆర్యద్రోహుల కుట్రలను బహిర్గతం చేస్తూ పి[illegible]

ప్రక్రియల్లో సాహిత్యాన్ని రాయాలి.

9. పేర్లు, పండుగలు, ఒకటేమిటి సంస్కృతిని సమూలంగా పునరుద్ధరించ వలసిన సమయం ఆసన్నమైంది.

10. మన రాజకీయ, ఆర్థిక వ్యవస్థలను ప్రతిబింబించే విధంగా వ్యవస్థను తీర్చి దిద్దాలి

ఇంకా ఇట్లాంటి పనులు చాలా చేయాలి.

దేశీయ తాత్త్విక, సాంస్కృతిక పునర్వికాసమంటే, తక్కిన రంగాలను కూడా పునర్వికాసం వైపు మళ్ళించాలని ఆలోచించాలి.

వివరాలకు :

వి. రామకృష్ణ
చార్వాకాశ్రమం,
నిడమర్రు (పోస్ట్), మంగళగిరి (మం॥),
గుంటూరు జిల్లా - 522 503. ఫోన్: 31778.

ఇట్లు
నాస్తికసమాజం
రాష్ట్ర శాఖ.

ఏ నోట విన్నను ఏదో షిధమ్మగు
కుంభకోణాలపై గొడవ వొకటి;

ఎచ్చోట చెవిబెట్ట రచ్చ కెక్కిన యట్టి
'స్కాము'ల స్వాముల సరణి వొకటి;

ఏ దిక్కు వీనుల నిడ్డె బెట్టెదమన్న
సర్వభక్షక కోటి పర్వ మొకటి;

ఏ మూల శ్రుతి జేర్చ మామూలుగా దోచు
అవినీతిమయమైన అవకతవక;

ఇంగ్లీషు మాధ్యమికాన్ని వీడండి
తల్లి బాసలో చదవండి

ఘనంగా జరిగిన

నాస్తికమేళా

9వ నాస్తికమేళా 10-2-2001న గుజ్జనగుళ్ళ కళామండలి వారి గురజాడ గేయాలాపనతో ప్రారంభించబడినది.

ఈ సభకు డా॥ గోపీనాథ్ (కార్డియాలజిస్ట్) అధ్యక్షత వహించారు. ఏ. రజిత గారు పెరియార్ విగ్రహాన్ని చార్వాక ఆశ్రమ ప్రాంగణంలో ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణ అనంతరము ఆమె పెరియార్ గురించి వివరిస్తూ- పెరియార్ కేవలం తమిళనాడుకే పరిమితం కాదు, ఆతడు జాతీయ నాయకుడు అన్నారు

పెరియార్ స్త్రీలకోసం చేసిన ఉద్యమం మహోన్నతమైనది. దేశంలో సాంఘిక విప్లవకారులు అనేకులు వున్నారు. పెరియార్‌ను మొదటిగా తీసుకోవాలి. పితృస్వామ్య వ్యవస్థచే అణచబడిన స్త్రీల విముక్తి కోసం పోరాటం చేశాడు. పెరియార్ అనగా పెద్దవాడు అని అర్థం. అతను నడిపిన ఉద్యమం స్వయం గౌరవ ఉద్యమం

పితృస్వామ్య వ్యవస్థ స్త్రీని పెళ్ళి, శీలం, కుటుంబం అనే చట్రంలో బంధించింది. ఒక యంత్రము లాగా తయారు చేసింది. పితృస్వామ్య వ్యవస్థ ద్వారా కుటుంబమునకు బందీ అయిన స్త్రీకి పెరియార్ ప్రశ్నించడం నేర్పాడు. పురోహిత వ్యవస్థను ప్రశ్నించండి అని నూరిపోశాడు.

ఆనాటి వ్యవస్థ స్త్రీని భోగ వస్తువుగా చిత్రీకరించినది. కాబట్టి పెరియార్ ఆ వ్యవస్థను కూలదోయాలని పిలుపునిచ్చాడు. దేవదాసి వ్యవస్థ స్త్రీని అణచి వేయడానికి తోడ్పడింది. వారి ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టింది. కావున స్త్రీ లు- స్వేచ్ఛ, స్వయంగౌరవం, సహచర్యం, సమానత్వం కోసం పోరాడాలని చెప్పారు.

శీలం అనేది రాచపుండు పురుషస్వామ్య వ్యవస్థ స్త్రీలని బానిసలుగా తయారు చేసింది. వివాహ వ్యవస్థ ద్వారా పురోహిత వర్గం స్త్రీలను బానిసలుగా తయారు చేసింది. పురుషస్వామ్య సమాజం వివాహ వ్యవస్థను పురుషాధిక్యతను చాటటానికి తయారుచేసింది అని చెప్పారు.

స్త్రీల ఉద్యమాలలో ఇంతవరకూ ఏ ఉద్యమం గూడా విజయవంతం కాలేదని ఎ. రజిత వివరించారు. స్వయంగౌరవ ఉద్యమం నడిపిన పెరియార్‌ను మరువలేమని చెప్పారు.

ఆ తరువాత రజిత గారు- హిందూ స్త్రీల ఉన్నతి - అధోగతి; బి.ఆర్. అంబేడ్కర్; స్వయంగౌరవ ఉద్యమము స్త్రీలు - పెరియార్ పుస్తకాలను ఆవిష్కరించారు.

సభకు అధ్యక్షత వహించిన డా॥ గోపీనాథ్ గారు మాట్లాడుతూ- రాజకీయాల మేళవింపుతో నాస్తికోద్యమం దేవుడు అనే భావజాలాన్ని పోగొట్టి భౌతికవాద భావజాలాన్ని ప్రజలలోకి తీసుకుపోవాలని సూచించారు. సాంస్కృతిక ఉద్యమం గాని, సామాజిక ఉద్యమం గాని రాజకీయ సమన్వయంతో జరగాలని చెప్పారు.

ఈనాడు బ్రాహ్మణీయ భావజాలం ప్రజలలో పెరిగినందున నాస్తికులపై అనేక దాడులు జరగటానికి ఆస్కారం ఏర్పడింది. కాబట్టి నాస్తికోద్యమం ఇంకా బలంగా జరగాలని సూచించారు హిందూ భావజాలం రోజు రోజుకు పెరిగి మతోన్మాదం రూపం తీసుకుంది.

మతం అనేది ఏనాడైనా మానవ మారణహోమానికి తోడ్పడింది. కాబట్టి మత భావాలను పోగొట్టటానికి అందరు సహకరించాలని, ప్రమాదకరమైన B.J.P R.S.S, V.H.P తదితర భావజాలంతో చేసే దాడులను నిరోధించాలని గోపినాథ్ గారు సూచించారు హేతుబద్ధమైన భావజాలం పెరగాలని పిలుపు నిచ్చారు.

అనంతరం కీర్తి విద్యా నికేతన్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, మంగళగిరి గారు ఉపన్యసిస్తూ మేళాకు ఎంతమంది వచ్చారు అనేది గాకుండా వచ్చిన ప్రతి వారు ఒక సైనికుడుగా పనిచేసి మత భావజాలాన్ని నాశనం చేయాలని చెప్పారు బుద్ధుడు, వేమన, పెరియార్, అంబేడ్కర్ చూపిన మార్గదర్శకంలో పనిచేయాలని సూచించారు. నాస్తికత్వం అనేది ఒక ప్రజా ఉద్యమాన్ని సంతరించుకోవాలి అని అన్నారు. భౌతికవాద మిత్రులు అందరూ ఒక కుటుంబం లాగా కలుసుకోవాలి.

వాళ్ళ రంగంలో వారు సరైన కృషి చేస్తూ ప్రావీణ్యం సంపాదించి నిజాయితీగా వుంటూ భావజాలాన్ని చెప్పాలి. అపుడు వారికి సంఘంలో గౌరవం వుంటుంది. కనీస కార్యక్రమాలు చేయాలి.. మానవుడు ప్రకృతి పరిణామదశలో వచ్చాడు. భావదాస్యం నుండి బయటపడటానికి నాస్తికత్వం అవసరం అని వివరించారు.

కె. అయ్యన్న మహబూబ్‌నగర్ జిల్లా నాస్తికసంఘం ప్రధాన కార్యదర్శి అధ్యక్షత వహించగా మధ్యాహ్నం సమావేశం ప్రారంభించబడినది. సభకు అధ్యక్షత వహించిన కె. అయ్యన్న మాట్లాడుతూ- దైవభక్తి పేరుతో క్రూరకార్యాలు చేసే ఆస్తికులు శాంతి మంత్రం పఠించే పురోహితులు ఆనాడు లోకాయతులను చార్వాకులను, భౌతికవాదులను చిత్రహింసలకు గురిచేశారు.

వారిని చోరులుగా, దైవద్రోహులుగా, అరాచక వాదులుగా, పాషండులుగా పిలిచి నాస్తికవాదులను, భౌతికవాదులను హింసించి వారి సిద్ధాంత గ్రంధాలను నాశనం చేశారు. ఆనాటి భౌతికవాద మేధావులైన అజితకేశకంబళ్ గొప్ప పండితుడు. ఉపనిషత్తులలోని భావవాదాన్ని తీవ్రంగా ఖండించాడు. నియమబద్ధమైన జీవితాన్ని గడిపి ఇతరులకు మార్గదర్శకం అయ్యాడు.

భావవాదానికి వ్యతిరేకంగా తాత్విక పునాది గల ప్రజా సంస్కృతిని నెలకొల్పడానికి ప్రయత్నించి ప్రాణాలను సైతం బలిపెట్టాడు. ఇతడు నాలుగు భూతాల సంయోగం వల్లనే చైతన్యం ఏర్పడుతుందని చెప్పాడు. యజ్ఞయాగాలు వ్యర్థమని అన్నాడు.

మఖలి గోశాలుడు : ఇతడు మానవుడు ఉత్తమ జీవి. ప్రయత్నం చేత ఎంతటి ఉన్నత స్థానాన్ని అయిన సంపాదించ గలడని చెప్పాడు.

కపిలుడు : ఇతడు సాంఖ్య సిద్ధాంతాన్ని చెప్పాడు. ప్రపంచ సృష్టికి దేవుడు కారణం కాదన్నాడు. శూన్యం నుంచి ఏ వస్తువును సృష్టించలేమన్నాడు. అన్నిటికి భౌతిక పదార్థమే మూలమన్నాడు.

కణాదుడు : ఇతడు ఈ ప్రపంచం వాస్తవమైనదని దీనికి మూలం అణువులు అన్నాడు. పదార్థ పరిణామమే విశ్వం అన్నాడు. ఈ జగత్తుకు సృష్టికర్త ఎవడూ లేడన్నాడు. ప్రచారం చేశాడు. క్రీ.పూ. 3, 4 వందల సంవత్సరాలనాడే ఆనాడు తమకున్న జ్ఞానంతో ప్రకృతిని గురించి అంత గొప్పగా చెప్పిన భౌతికవాదులను ఈసడించి నిందలకు గురిచేసి పురోహిత వర్గం వారి సిద్ధాంతాలను ఎలా భ్రష్టు పట్టించిందో వివరించారు.

సైన్స్ అభివృద్ధి చెందక పూర్వమే చార్వాకులు ఈ సృష్టికి మూలం ఏమిటో వివరించారంటే వారి మేధాశక్తి ఎంత గొప్పదో ఆలోచించాలన్నారు. అన్ని విమర్శలకు నాంది మత విమర్శ అయినప్పటికి కేవలం మతాలను తిడుతూపోతే,

సాధించేది ఏమీ వుండదని, మత వాదులకు ప్రతిగా ప్రజా సంస్కృతి నిర్మాణంలో భాగంగా ఇలాంటి నాస్తిక మేళాను బి. రామకృష్ణ గారు ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రత్యామ్నాయ సంస్కృతిని ఎలా నిర్మించుకోవాలో తెలియజేసే అంశాలను రామకృష్ణ గారు ఎలా సిద్ధం చేశారో వారి మాటలలోనే వివరించారు.

1. ప్రత్యామ్నాయ సంస్కృతిలో భాగంగా విరివిగా నాస్తిక సాహిత్యాన్ని సృష్టించుకోవాలి.
2. విద్యాలయాలు స్థాపించుకొని నాస్తిక భావజాలాన్ని అభివృద్ధిపరచుకోవాలి.
3. పెళ్ళి వ్యవస్థను మార్చుకోవాలి.
4. నాస్తిక కుటుంబాలు కలుసుకోవాలి. నాస్తికత్వాన్ని గురించి చర్చించుకోవాలి.
5. నాస్తిక సభలు, సమావేశాలు జరిపి ప్రచారం చేయాలి.
6. మన పేర్లను, మన పిల్లల పేర్లను, వీధుల పేర్లను మార్చుకోవాలి. భౌతిక మేధావులైన పూర్వుల పేర్లను పెట్టుకోవాలి
7. పీఠాలు స్థాపించుకోవాలి.
8. ఆచార సాంప్రదాయాలలో మార్పులు చేసుకోవాలి.
9. పండుగలలో మార్పులు చేసుకోవాలి. నాస్తిక పండుగలు జరుపుకోవాలి.

మత వాదులకు అనేక రకాలైన పురాణ పండుగలు వున్నాయి మనం మన పండుగలు జరుపుకోవాలి. ఆ విధంగా ఆచరణాత్మకమైన సంస్కృతిని నిర్మించుకోవాలని, భావజాలాన్ని విరివిగా ప్రచారం చేయటం ద్వారా ఈ సామాజిక వ్యవస్థ మార్పు కోసం ప్రయత్నించాలని చెప్పారు.

చార్వాక విద్యా పీఠం విద్యార్థులు చామవాకులం మేం సత్యకాములం అనే గేయాన్ని ఆలపించారు. ఈ సభలో నాగార్జున యూనివర్శిటి ప్రొఫెసర్ N. అంజయ్య గారు మాట్లాడుతూ- "లోకాయతం ప్రజా ఉద్యమం అనే అంశాన్ని సుదీర్ఘంగా వివరించారు ఈనాడు లోకాయతాన్ని ఎందుకు అధ్యయనం చేయాలి. జీవితాన్ని సరైన పద్ధతిలో వుంచుకోవాలి. భౌతికవాద దృక్పధాన్ని కలిగివుండాలి.

ఈనాడు ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ అనేది మనపై ఆధిపత్యాన్ని తెచ్చిపెట్టింది. చదువు ఒక్కటే విజ్ఞానానికి ప్రమాణం కాదు నాస్తికుడైనంత

మాత్రాన అన్ని విషయాలలో నిజాయితీ ప్రదర్శించ గలదని చెప్పలేం. లోకాయతం ప్రజల తత్వం. ప్రజలు అంటే ఎవరు? ఎవరు సంపదలు సృష్టిస్తారో వారే ప్రజలు. వారే సంపదలకు మూల కారకులు అవుతారు. స్త్రీలు కూడా ప్రజలే భూస్వామ్య విధానంలో రైతులు ప్రజలు సామాజికశాస్త్రం దృష్ట్యా ప్రజలెవరంటే కాలమాన, దేశ పరిస్థితులలో మారిన పరిస్థితులలో వారి తత్వం ప్రతిబింబించాలి. వారే ప్రజలు అని ప్రజలు అనే దానికి వివరణ యిచ్చారు.

- లోకాయతులు అనే పేరు ఎలా వచ్చింది ?

లోకేషు + ఆయత = లోకాయత అంటే అర్థం ప్రజల మధ్య వుండేవారు. భారతదేశంలో పుట్టిన వారినందరిని ఆధ్యాత్మిక వాదులు అనడం తప్పు సర్వేపల్లి రాధాకృష్ణ భౌతికవాదం అనే పదానికి లోకాయతం అనే రాశారు. లోకాయతం, చార్వాకం భౌతికవాదానికి సమాన పదాలు. లోకాయతం ప్రపంచాన్ని అర్థం చేయిస్తుంది. ఆస్తికులు చెప్పే అంతరంగిక దృష్టి అంటే అధ్యాత్మిక వాదమే.

అనంతరం గుత్తా రాధాకృష్ణ (ఆం. ప్ర. హేతువాద సంఘం అధ్యక్షులు) ప్రసంగిస్తూ త్రిపురనేని రామస్వామి రాసిన పద్యాన్ని వినిపించి, అతను తన గ్రంథములో ఉదహరించిన విషయాలను చెప్పారు.

మోక్షం లేదు; యోగం శుద్ధ దండుగ. "జపతో నాస్తి పాతకః" ఇది ఆస్తికుల నినాదం. "కృషితో నాస్తి దుర్భిక్షం" ఇది రైతుల నినాదం, భౌతికవాదుల నినాదం. తత్వజ్ఞానం మనిషిని నడిపిస్తుంది. భావజాలం పూర్తిగా అర్థమవుతుంది. మతం లేకుండా మనిషి సామాజిక జీవనం గడపగలడనే వాస్తవాన్ని బహు ప్రాచుర్యం లోకి తీసుకురావాలని గుత్తా రాధాకృష్ణ గారు సూచించారు.

మొదటి రోజు రాత్రి 7 గంటలకు సందుపట్ల భూపతి గారిచే ఏకపాత్ర అభినయము ప్రదర్శించబడినది. చార్వాక విద్యాపీఠం విద్యార్థులచే నాటకం ప్రదర్శించబడినది.

రెండవరోజు సమావేశానికి వంగర లక్ష్మీకాంత్ నాస్తిక సంఘం కార్యవర్గ సభ్యుడు అధ్యక్షత వహించగా, నాగరూప్ గారు (గుంటూరు) బౌద్ధ ధర్మ పై మాట్లాడినారు. నాగరూప్ గారు బౌద్ధ ధర్మాలను వివరిస్తూ- దమ్మం అనగా అర్థం ధర్మం. దమ్మ అనే పదం పాలి భాషకు చెందినది. ధర్మం అనగా నీ బాధ్యత అని అర్థం. దేవుడు, నరకం అబద్ధం. ఇవి మనిషి పెట్టినవే. పాప, పుణ్యాలు

లేవు. రాజకీయంను ఉపయోగించుకొని మతాలు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించినవి.

చార్వాకం అనేది కొంతమంది సిద్ధాంతం. వైదిక మతానికి వ్యతిరేకంగా బుద్ధుడు పుట్టాడు. సమాజానికి ఏది అవసరమో, ఏది అనవసరమో బౌద్ధం తెలియ జేస్తుంది. బౌద్ధం ఈనాడు అనుకున్నట్లుగా మతం గాదు. ఇది ఒక జీవన విధానం. మానవుని అవసరాల్లు తీరడానికి బుద్ధుడు కొన్ని సూత్రాలు చెప్పాడు.

అతడు తను చెప్పినదే నిజమని అనలేదు. బుద్ధి వివేచనతో సత్యాన్ని గుర్తించమన్నాడు. బహుళ ప్రజానీకానికి అవసరమైన దానిని గుర్తించి ఆచరించమన్నాడు. మనిషి ఆహారంతోనే జీవించలేడు. మానవునికి వ్యాపకం కావాలి. మంచి వ్యాపకాన్ని చూపేది బౌద్ధం. హేతురహితంగా చేసేది ఏది వాస్తవం కాజాలదు. హేతు పూర్వకమైన వాటినే ఆచరించాలి.

పెద్దలు చెప్పిన దానిని ఆచరించాలి అంటారు. కాని, ఏదీ మార్పు లేకుండా వుండదు. మార్పుకు అతీతమైనది లోకంలో ఏదీ లేదు. ప్రతిదీ మార్పు చెందుతూ వుంటుంది. బుద్ధుడికి ముందు చార్వాకులు వున్నారు. చార్వాకుల ప్రభావం బుద్ధునిపై వున్నది. బుద్ధుని అనంతరం బౌద్ధాన్ని మతంగా మలిచారు. మానవత్వం లేని మతవాదులు బుద్ధున్ని దేవునిగా మలిచారు.

దశావతారాలతో బుద్ధున్ని చేర్చారు. పరశురాముని తీసివేసి బుద్ధుని దశావతారాలలో చేర్చారు. బౌద్ధంలో హైందవులు పూజా విధానాన్ని ప్రవేశపెట్టారు బుద్ధుని బొమ్మ వుంచి పూజించాలని చెప్పారు. పదిమందికి ఉపయోగపడే దానిని గురించి బుద్ధుడు చెప్పాడు. ఏ విషయమైనా హేతు పూర్వకంగా చెప్పాడు. బుద్ధుడు ప్రపంచంలో మొట్టమొదటి హేతువాది అని నాగరూప్ గారు అన్నారు. విమర్శ వుండాలి కాని సద్విమర్శ వుండాలి. కుయుక్తితో కూడిన విమర్శ వుండరాదని చెప్పారు. జ్ఞానాన్ని పెంచమని బౌద్ధం చెప్పిందని వివరించారు.

అనంతరం డా॥ విజయకుమార్ గారు ఉపన్యసిస్తూ ప్రపంచంలో, మనదేశంలో జరిగిన రెండు ముఖ్యమైన సంఘటనలు జీవులలో జీన్సులు వున్నవని, జీవకణాలు వున్నవని కనుగొన్నారు. మనిషి శరీరంలో లక్షల జీన్సులు వున్నాయి. జీవ కణాలలో కూడా లక్షల కణాలు వుంటాయి.

స్టీఫెన్ హాకింగ్ : ఇతడు ఖగోళ శాస్త్రవేత్త. ఇతని శరీరంలో మెదడు

తప్ప మిగతా అవయవాలు పనిచేయడం లేదు. 20వ శతాబ్దంలో ఐన్‌స్టీన్ తర్వాత అంతటి మేధావి "స్టీఫెన్ హాకింగ్". సైద్ధాంతిక భౌతికశాస్త్రంలో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ తర్వాత అంతటి పేరు ప్రఖ్యాతులు గావించిన బ్రిటన్ శాస్త్రవేత్త ప్రపంచ వ్యాప్తం గా ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. బ్లాక్ హోల్స్ క్వాంటమ్ రేడియేషన్ ను వెలువరిస్తాయని 32 సం॥ వయస్సులోనే హాకింగ్ ప్రతిపాదించిన సిద్ధాంతం అతనికి మంచి పేరు తెచ్చిపెట్టింది బ్లాక్స్‌హోల్స్ లేవని ఇటీవల కొంతమంది శాస్త్ర వేత్తలు అంటున్నప్పటికి హాకింగ్ "బ్లాక్ హోల్స్" అస్తిత్వాన్ని పూర్తిగా నమ్ముతున్నారు.

తన వాదనతో ఏకీభవించని శాస్త్రవేత్తలు "బ్లాక్‌హోల్స్" లేవని మాత్రమే చెబుతున్నారు. కాని వారి వాదనలను ప్రయోగాత్మకంగా నిరూపించుకోవడం లేదని హాకింగ్ అభిప్రాయం. శాస్త్రీయ అంశాలలో భగవంతుణ్ణి దూర్చడం సరైనది కాదని దీనికి ఏ శాస్త్రవేత్త ఇష్టపడడని, ఇలాంటి అంశాలను దూర్చడం వలన శాస్త్రీయ అంశాలకు విలువ లేకుండా పోతుందని స్టీఫెన్ హాకింగ్ చెప్పినట్లు అతనిని గురించి డా॥ విజయకుమార్ వివరించారు.

డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని వివరించాడు. డార్విన్ అవయవాల గురించి చెప్పాడు. బొటన వ్రేలు కదలి ఇటు రావడం వల్ల మానవుడు ఆయుధాన్ని పట్టగలిగినాడు. శ్రమ చేసే దశకు బొటనవ్రేలు పనికివచ్చింది. ముందు కాళ్ళు శ్రమ చేసే అవయవాలుగా మారినాయి. మానవుని స్వరపేటికలో మార్పు కలిగింది. మెదడులో మార్పు వచ్చింది. మనిషి ఇన్ని రకాలుగా వుండటానికి కారణం మనిషి శరీరంలో వున్నటువంటి ప్రొటీనులు.

ప్రొటీనులు 24 రకాలు. హిమోగ్లోబిన్ అది ఒక ప్రొటీన్ ఒక హిమోగ్లోబిన్ కణంలో అమినాయాసిడ్‌లు వుంటాయి. బాతుకు, కోడికి అవయవ నిర్మాణంలో భేదం వున్నది. దానికి హిమోగ్లోబిన్‌లు వున్నాయి "సైటోక్లోజెమ్" అనే ఎంజైము ఈ విశ్వం ఎలా పుట్టింది అనే ప్రశ్న పుడుతుంది. గెలాక్సి ఎక్కడ నుండి పుట్టింది విశ్వంలో "బ్లాక్‌హోల్స్" వున్నాయి. ఒక పెద్ద విస్పోటనం జరిగి "గెలాక్సి" ఏర్పడింది.

"స్టీఫెన్ హాకింగ్" వాస్తువు తప్పు అన్నాడు. భూకేంద్ర సిద్ధాంతంపై వాస్తు ఆధారపడి వుంది విశ్వానికి భూమి కేంద్రం కాదని పోలెండ్ ఖగోళ శాస్త్రవేత్త

కోపర్నికస్ నిరూపించాడు. విశ్వానికి సూర్యుడు కేంద్రమని చెప్పాడు. నమ్మకానికి శాస్త్రమే పునాది. లెనిన్ మెటీరలిజం పుస్తకం రాశాడు. ఇది సైన్స్ గురించి లెనిన్ రాసిన పుస్తకం.

ఈ పుస్తకంలో లెనిన్ తత్వశాస్త్రానికి, సైన్స్‌కి వున్న సంబంధాన్ని గురించి చెప్పారు. ఎలక్ట్రానిక్ పరమాణువులు నాశనము కానివి. పరమాణువులను బద్దలు కొడితే ఎలక్ట్రానులు వచ్చినవి. న్యూటన్ ఫిజిక్స్‌లో ప్రతి వస్తువుకు చర్య ప్రతిచర్య వుంటాయని చెప్పాడు

"జినోము" గురించి డా॥ గారు వివరిస్తూ మానవ శరీరంలో లక్షల ప్రొటీనులు వున్నవి. అమీనా యాసిడ్‌లు వున్నవి. 20 రంగులలో పెద్ద దండ తయారు చేయవచ్చు. ప్రొటీవులి వల్ల జీవులు అనేక రూపాలు పొందినవి, ఇన్సులిన్ మందు వుంది. ప్రాణం బతకడానికి ఇన్సులిన్ అవసరం. జంతువుల నుండి తీసిన ఇన్సులిన్ వాడుతున్నారు. ప్రొటీన్స్‌ల జీన్స్, ప్రొటీనుల భేదం డాలి అనే గొర్రెను లాబరేటరీలో తయారుచేశారు. ఆ గొర్రెపిల్ల ఇంకో పదార్థం. తన సహజ శక్తుల వల్ల పదార్థం పరిణామం వల్ల మార్పు పొంది వుంటుంది అని చెప్పారు.

మధ్యాహ్నం సమావేశానికి దుర్గం సుబ్బారావు అధ్యక్షత వహించారు. దళిత ఉద్యమం - సామాజిక పరిణామం అనే అంశంపై మద్దు అంకయ్య గారు ఉపన్యసించారు. అంబేద్కర్ గొప్ప మేధావి, ప్రపంచ మేధావి. అతను అణచివేతకు గురైన దళితులకు వెలుగు బాటను చూపారు అంబేద్కర్ సూక్తులను మనం ఆచరించాలి. కాని అతని విగ్రహాలు పెట్టి పూజలు చేయరాదు అన్నారు. దళిత ఉద్యమం మీడియాలో ప్రచారం అవుతున్నది. 1980లో దళిత ఉద్యమం ప్రారంభమైనప్పటికి అది ఒక సమగ్ర రూపాన్ని ఈ మధ్య కాలంలోనే సంతరించుకున్నది.

బ్రాహ్మణ భావజాలం నిర్మూలనకు దళిత సంఘాలు కృషి చేయవలసి యున్నది. బ్రాహ్మణీయ సంస్కృతి అన్ని కులాలలోను అన్ని ఇండ్లలోను వేళ్ళూనుకొని వున్నది. దళితులకు సన్మాన కార్యక్రమాలు జరుగుతున్నవి, కాని కొందరు సన్మానం అనగానే శాలువాలు కప్పుకోవడం మెమొంటో తీసుకోవటం, పుస్తకాలు ఇవ్వడం జరుగుతున్నది. సన్మానం అంటే ఇవి కాదు అన్నారు.

బి.ఎం. లీలాకుమారి బ్రాహ్మణేతర ఉద్యమం - దాని అవసరం గురించి మాట్లాడుతూ పూర్వం బ్రాహ్మణీయ భావజాలన్ని ఎదుర్కొనుటకు జ్యోతిరావు పూలె, పెరియార్, అంబేద్కర్ లాంటి మహానుభావులు కృషి చేశారు. బ్రాహ్మణీయ భావజాలం చాలా ప్రమాదకరమైనది. ప్రత్యామ్నాయ సంస్కృతి అనుకున్నపుడు ప్రజా సంస్కృతిలో భాగంగా నాస్తికమే నిర్వహించబడుచున్నది.

విద్య అనేది సంస్కృతిలో ఒక భాగం. ప్రాథమిక విద్యను BJP కాషాయీకరణం చేయడం మొదలుపెట్టింది. విలువలు గలిగిన విద్యను విద్యార్థులకు అందించాలి. వివిధ మతాలకు చెందిన వాటిని గురించి తులనాత్మక పరిశీలన జరగాలని చెప్పారు.

అనంతరం- శకుంతల స్త్రీలు సమాజ పరిణామం అనే అంశము మీద మాట్లాడారు. స్త్రీలు పురుషుల ఆధిపత్యము క్రింద నలిగిపోతున్నారని వారికి భావ స్వేచ్ఛ కల్పించే అంశము పురుషుల పైనే ఆధారపడి వున్నది అన్నారు. స్త్రీలు సమస్యల కొరకు కాకుండా, పురుషులే స్త్రీల సమస్యల కొరకు పూర్వం పాటుపడ్డారని వివరించారు.

తరువాత Y.K. గుంటూరు లాయర్ గారు మాట్లాడుతూ- ఆంధ్రదేశములో నాస్తిక సంఘాలు, హేతువాద సంఘాలు తమపై వున్న బాధ్యతాయుతమైన పనులు చిత్తశుద్ధితో చేస్తున్నారని చెప్పారు. ప్రజలలో మూఢత్వాన్ని తొలగించడానికి, భావవాద భావజాలాన్ని నిర్మూలించడానికి ఈ సంఘాలు చేస్తున్న కృషి తక్కువ ఏమీ కాదని, దీనిని ఇంకా ముందుకు తీసుకుపోవలసిన అవసరమున్నదని సూచించారు.

అనాడు అనగా పురాణ కాలంలో రాముడు రామాయణంలో శంబూకుని తల నరికి చంపడము నిమ్న జాతులు తపస్సు చేసుకోవడానికి కూడా వీలు లేదని ఆంక్షలు పెట్టిన సంగతిని మనం గుర్తించాలి. ఇది బ్రాహ్మణవాదుల కుట్ర ఫలితమే కాబట్టి బ్రాహ్మణీయ భావజాలాన్ని దెబ్బకొట్టకుండ ఈ దేశంలో మనం ఏమీ చేయలేమనే విషయాన్ని సూచించారు.

కొందరు పనిగట్టుకొని నాస్తికులపై, హేతువాద సంఘాలపై నిందలు వేస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదని సూచించారు. భౌతికవాదు లందరు కలసి ఐక్యమవ్వాలని ఐక్యవేదిక ఏర్పాటు చేసుకొని సాంస్కృతిక పోరాటాలలో పాల్గొనాలని

చెప్పారు. శ్రామిక, సాంస్కృతిక పోరాటాలు రాజకీయాలకు దూరంగా చేయటాన్ని విమర్శిస్తూ కొందరు చెబుతున్న విషయాలకు జవాబుగా ఆతను, శక్తిమేర ఎవరి పోరాటాలు వారు చిత్తశుద్ధితో ఆచరించినపుడే విజయవంత మవుతాయని చెప్పారు.

చివరగా- నాస్తికమేళా ముగింపు గావిస్తూ వి. రామకృష్ణ (చార్వాకాశ్రమ నిర్వాహకులు) మాట్లాడుతూ భావవాదులలో ఎన్నో రకాల విభేదాలు వున్నప్పటికి ఆస్తికులు ఒక్కటి అవుతున్నారు. కాని, భౌతికవాదులమైన మనం ఏకం కాలేక పోతున్నాం.

నాస్తికమేళా భౌతికవాదుల అందరి కొరకు నిర్వహించ బడుచున్నది. దీనికి అందరూ చేయూత నివ్వాలని కోరినారు. R.S.S, B.J.P పటిష్టంగా తన స్థావాన్ని పదిలపరచు కొనుచున్నది. దానిని మనం గుర్తించలేక పోతున్నాము దానిని ఎదుర్కొనడానికి భౌతికవాదులు అందరు ఐక్యమవ్వవలసిన అవసగమున్నది.

కోటప్పకొండ జాతర జరుగుతున్నదంటే అందరు వెళతారు దానికి ఎవ్వరికీ ఆహ్వానాలు వుండవు. మరియమ్మ తిరునాళ్ళకు క్రైస్తవులు అందరు తరలి వెళతారు. వారికి ఎవరి పిలుపు వుండదు. కాబట్టి భౌతికవాదులమైన మనం మన పండుగలు మనం జరుపుకోవాలి. మన మేళాలు మనం ఉత్సాహంగా నిర్వహించుకోవాలి. దీనికి పిలవలేదని భావించరాదు అన్నారు. ○

2002 ఫిబ్రవరి 9, 10 తేదీలలో గుంటూరు జిల్లా
మంగళగిరి మండలం, నిడమర్రు చార్వాకాశ్రమంలో జరిగే

10వ నాస్తికమేళాను

జయప్రదం చేయండి!

చివరకు గెలుపు

మూలవాసులదే

2001 ఆగష్టు 31వ తేది నుండి సెప్టెంబరు 6వ తేది వరకు దక్షిణాఫ్రికా లోని దర్బన్‌లో జాతి వివక్షపై సదస్సు జరిగింది.

ఈ దేశంలో కూడా కులవివక్ష వుంది. కాబట్టి, కుల వివక్ష కూడా దర్బన్‌లో జరిగే సదస్సులో చర్చించవలసిందేనని చాలాకాలం నుంచి దళిత సంఘాలు, దళిత నాయకులు, మానవహక్కుల సంఘాలు, వామపక్ష రాజకియ పార్టీలు, లౌకిక వాదులు డిమాండు చేశారు.

కేంద్రప్రభుత్వ అనుమతి కావాలి దీనికి. కాని, కేంద్రంలో పేరుకు కూటమి పాలకవర్గమైనా, ఆచరణలో హిందూ మత పార్టీ కాబట్టి మొదట్లో ఈ డిమాండును ఖాతరు చేయలేదు. అయినా, యిది ఓట్ల రాజకీయం కాబట్టి ఎట్టకేలకు దళితులు, దళిత సంఘ నాయకులు ఇతరులు పెట్టిన డిమాండును అంగీకరించక తప్పలేదు. సెప్టెంబర్ 6 వరకు దర్బన్‌లో జరిగిన సదస్సులో కులవివక్ష పైనా, అంటరాని తనం పైనా చర్చ జరిగింది. ఇది సంతోషించదగ్గ విషయం. చివరకు దేశీయులే గెలిచి తీరుతారనే దానికిది నిదర్శనం.

అయితే కొన్ని విషయాలను ఈ సందర్భంలో సూచనప్రాయంగా తెలియజేయటం, తెలుసుకోవటం అవసరం.

హితం మనోహారిచ దుర్లభం వచః

అందరికీ హితవుగా వుండేదాన్నీ, మనోహరంగా వుండేదాన్నీ అయిన మాటను చెప్పటం ఎవరికైనా కష్టం. అసాధ్యం కూడా హితవును బోధించాలంటే అది మనోహరంగా వుండదు. మనోహరంగా చెప్పాలంటే అది హితవు గాదు. పైత్య దోషం గలవాడికి తీపి పంచదారైనా చేదుగా వుంటుంది. అంతే, ఎంత మంచిమాట చెప్పినా మనోహరం గానప్పుడు అయిష్టంగానే వుంటుంది. అయినా, మంచిని ఆశించే వాడు వీటిని లెక్కచేయక చెప్పక తప్పదు.

ఇప్పుడు చెప్పబోయే మాటలు, ఈయబోయే సూచనలు దళితులకూ, దళిత సంఘ నాయకులకూ హితవైనవేమో గాని, మనోహరంగా వుండవని గ్రహిస్తారు. కటువుగా వున్నా చెప్పక తప్పదు.

కుల వ్యవస్థ, అంటరానితనం లేకుండా ఏం చేయాలి?

కుల వ్యవస్థ నిర్మూలన గావాలన్నా, అంటరానితనం మంటకలవాలన్నా మనం అంటే దేశీయులం ఏం చేయాలి? అనేది పెద్ద ప్రశ్న ..ల ఏళ్ళ తరబడి సాగుతున్న నేపథ్యం దీని కుంది ఈ సామాజిక వ్యవస్థ నిర్మాణం ఎట్లా జరిగింది? అనేది కూడా చర్చనీయాంశమే. అయితే, దాన్నిక్కడ చోటు లేదు కాబట్టి మనం ఆ విషయం చర్చించి కాలాన్ని వృధా చేయం.

"ఆర్యా స్త్రైవర్ణికాః" అన్నా గౌతముడు తన ధర్మ సూత్రాల్లో- ఆర్యులు మూడు వర్ణాల్లో వున్నారని గ్రహించాలి. ఋగ్వేదం దశమ మండలం లోని పురుష సూక్తంలో- దేశీయులంతా శూద్రులని వాళ్ళు విరాట్పురుషుని పాదం నుంచి పుట్టారని చెప్పారు.

> బ్రాహ్మణోస్య ముఖమాసీత్
> బాహూరాజన్యః కృతః
> ఊరూ యిదస్య తద్వైశ్యః
> పద్భ్యాం శూద్రో S జాయత॥"

దీనికి భాష్యకారులు రకరకాలుగా అర్థాలు చెప్పారు. ఆర్య సామాజికులు దయానంద సరస్వతి లాంటి వాళ్ళు కూడా ఒక అర్థాన్ని గ్రహించారు. ఎవరేమి చెప్పినా "అజాయత" అంటే, పుట్టటమే. అందుకే శూద్రులకు విష్ణు పాదోద్భవులనే బిరుదు వచ్చింది.

వీళ్ళ తరువాత- ఆర్యుల పెత్తనాన్ని ధిక్కరించిన జనం వున్నారు. వాళ్ళ మ అంతే వాసులన్నారు. మను ధర్మశాస్త్ర రచనాకాలం నాటికే ఏర్పడి వుండవచ్చు. అందుకే మను ధర్మశాస్త్ర కారుడు (మనుధర్మ శాస్త్రం ఎవరు రాశారనేది చర్చనీయాంశం. అది సందర్భం గాదు కాబట్టి విడిచిపెడుతున్నాం) "నాస్తితు పంచమ" అన్నాడు.

శూద్రులు పై మూడు కులాల వాళ్ళకి సేవ చేయాలనీ, ఐదవ కులస్థులు

నీచులనీ, అంతే వాసులనీ, చండాలురనీ, అంటరానివారనీ, చెప్పరాని వారనీ రక రకాలుగా ఆడిపోసుకున్నారు. అట్లాగే చూచారు కూడా.

ఇది బ్రాహ్మణ వ్యవస్థ లక్షణం. ఆర్య ధర్మం కాతానిన నేలలో దేశీయులు చిత్రహింసల పాలయ్యారనేది వాస్తవం.

అందుకే దేశీయుల పైనా, దేశం పైనా ఆర్యులు "భౌతిక దురాక్రమణతో పాటు బౌద్ధిక దురాక్రమణ కూడా జరిపారు" అనే వాస్తవాన్ని అంగీకరించాలి.

వేల సంవత్సరాల నుంచీ ఈ ఆర్యధర్మం, అంటే బ్రాహ్మణ ధర్మం దేశంలో పెత్తనం నిరాఘాటంగా చేస్తూ వుంది.

1947లో దేశంలో అధికారం మారినా, సామాజిక వ్యవస్థ మారలేదు, మారినట్లుగా కనిపిస్తుంది. కారణం కొత్తరకం బ్రాహ్మణ వాదులు ఈ దేశాన్ని పాలించారు ప్రస్తుతం నేరుగా బ్రాహ్మణవాదులే ఈ దేశాన్ని పాలిస్తున్నారు,

గీతలో- "చాతుర్వర్ణ్యం మయాస్పృష్టం గుణకర్మ విభాగశః" అని రాశారు. అంతేగాకుండా "జన్మనా జాయితే శూద్రః, కర్మణా ద్విజ ఉచ్యతే" అని కూడా రాశారు.

కాని, ఇవేవీ ఆచరణలో ఫలితం ఈయలేదు. ఉద్యమాలు తలయెత్తినప్పుడు రాయితీలు ప్రకటించినట్టుగా వుంటాయి యీ రాతలు.

బౌద్ధాన్ని సనాతనీకరించిన అశ్వఘోషుడు వంటి పండితులు కూడా ఇట్లాగే రాశారు. అవన్నీ దేశీయుల కన్నీళ్ళు తుడపటానికి మాత్రమే పనికివస్తాయి.

నేటికీ బ్రాహ్మణ ధర్మం యధేచ్ఛగా సాగుతుంది. లోకాయతుల కాలం నుంచి నేటి వరకు ఈ బ్రాహ్మణ వ్యవస్థ మీద, కుల వ్యవస్థ నిర్మూలన కావాలనే విషయం గురించి తీవ్రమైన దాడి జరుగుతూనే వుంది.

కాని, సామాజికమైనదాన్ని, తాత్వికీకరణకు గురిచేసి. మానసికం చేసి చివరకు రాజకీయాంశంగా మలిచారు ఈనాడు కొంతమంది మిత్రులు కుల వ్యవస్థను రద్దు చేయడం సాధ్యంకాదు కాబట్టి కుల వివక్ష లేకుండా చేద్దామని పైకి ప్రచారం చేస్తున్నారు.

కొంతమంది వైద్యులు జబ్బుకు కారణం తెలియని వాళ్ళు, రోగ నిర్మూలనం గాక, రోగాన్ని అణచిపెట్టే మందులు వాడతారు. అది మందులు వాడటం ఆపగానే

తిరిగి తలయెత్తుతుంది. కులం వుండగా కుల వివక్ష లేకుండా ఎట్లా పోతుంది? ఆలోచించదగ్గ విషయం.

దళితులపై దమనకాండ ఆగలేదు. రెండు గ్లాసుల విధానం పోలేదు. మంచాల మీద నుంచి అగ్ర కులాల వారిని జూచి లేపడం తగ్గలేదు. పాతాళ గంగమ్మ పల్చదనం మానలేదు. దేవుడి చుప్పనాతి తనం నిలబడే వుంది. ఇంకా ఏం మారింది? అంతా నగిపి చేసుకొని తక్కువ మతం అపహాస్యం చేస్తూ వుండి.

విప్లవకారు లనబడే వాళ్ళ కొంపల్లోనే అంటరానితనం స్వైర విహారం చేస్తుంటే, బ్రాహ్మణ భావజాలం జీర్ణించిన వాళ్ళ యిళ్ళ సంగతి వేరే చెప్పటం దేనికి?

ఇది నిర్మూలం గాని విషయం గాదు. సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ, తాత్త్విక రంగాల్లో తగిన కృషి ప్రధానం. సాహితీరంగం కూడా పీటికి తోడు రావాలి వివరంగా చెప్పే చోటు కాదు. అందుకే స్థాలీపులాకంగా చెప్పి విడిచిపెట్టేయటం జరుగుతుంది.

దళిత సంఘాలు, దళిత నాయకులు పథకం ప్రకారం పనిచేయటం జరుగుతుందా ?

ఇల్లలకగానే పండుగ గాదు. దర్బన్‌లో కుల వ్యవస్థ, అంటరానితనంపై మాట్లాడటానికి అవకాశం వచ్చింది. ఎవరి సహకారంతోనో అక్కడికి వెళతారు. దీర్ఘమైన ఉపన్యాసాలే ఛేకారనుకోండి. అయితే, ఏం జొరుగుతుంది.

దేశంలో అంటరానితనం పోతుందా?

కుల వ్యవస్థ నిర్మూలన మవుతుందా?

ఏమీ గాదు. ఈ సామాజిక వ్యవస్థ నాలుగైదు వేల సంవత్సరాల నాటి పునాదులతో కాంక్రీటు చేయబడ్డది. తుమ్మినా దగ్గినా ఈ వ్యవస్థే ప్రతిబింబిస్తుంది.

అన్ని రంగాల్లో తన రూపాన్ని బ్రాహ్మణ వ్యవస్థ ముద్రవేసుకొన్నది. దీన్ని కదిలించగల శక్తి సామర్థ్యాలను దళిత సంఘాలు గాని, ఆ సంఘ నాయకులు గానీ పుణికిపుచ్చుకున్నారా? ఆ సంఘ నాయకులు దగ్గర దీన్ని ఎదుర్కొనే పథకాలున్నాయా?

అన్నిరంగాల్లో సుసంపన్నమైన వ్యవస్థను నిర్మూలించి, దేశీయ వ్యవస్థను దాని స్థానంలో రూపొందించటానికి వీళ్ళు చేస్తున్నదేమిటి? పథకం ప్రకారం రూపొందిన వ్యవస్థను నిర్మూలించటానికి దళిత నాయకుల వద్దనున్న పథనం ఏమిటి?

ఒక పథకం ప్రకారం చేయకుండా బ్రాహ్మణ వ్యవస్థను నిర్మూలించటం సాధ్యమవుతోందా? లేచిన దగ్గర్నుంచి నిద్రపోయే వరకు, పుట్టినప్పటినుంచి చచ్చే వరకు ఏ వ్యవస్థలో బ్రతుకుతున్నాం? పెళ్ళాం పిల్లలు ఎట్లా పెరుగుతున్నారు? బ్రాహ్మణ ధర్మం ప్రకారం కాదా?

డాష్‌లో తంతే, మనువు డాష్ పిసికితే నోటి దురుసుతనం ప్రయోగిస్తే వ్యవస్థ మారుతోందా? కాదే, ఋమ్మాటికీ కాదు.

దళితులుగా వున్న వాళ్ళు దళితులుగా ప్రత్యేక రాజకీయ శక్తిగా వున్నారా? ఎర్ర చొక్కా కొంతమంది తొడుక్కుంటే, కొంతమంది మూడు రంగుల చొక్కా తొడుక్కున్నారు. పచ్చ చొక్కా కొంతమంది తొడుక్కుంటే, కాషాయ రంగు చొక్కా కొంతమంది తొడుక్కున్నారు. అసలు దళితాభిప్రాయమే దళితులకు లేదు. అదే కనుక వుంటే- ఇన్ని రాజకీయపార్టీల్లో దళితులు చేరుతారా? ఇన్ని పార్టీల్లో వుంటారా?

అంబేద్కర్ తమకంటూ ఒక రాజకీయ పార్టీ వుండాలని రిపబ్లికన్ పార్టీ పెట్టారు. ఆ పార్టీ మనుగడ ఎట్లా వుంది? దళితులే చెప్పాలి

అంతేగాదు- దళితులంతా ఒకటిగా వున్నారా?

మాదిగ దండోరా ఎందుకు పుట్టింది? మాల మహానాడు ఎందుకు పుట్టింది? ఈ సంగతి దళిత నాయకులు ఆలోచించారా? ఆలోచించి ఏం చేస్తున్నారు? దర్శన్‌లో ఈ సంగతి ప్రస్తావిస్తే వీళ్ళ దగ్గర దొరికే సమాధానం ఏమిటి?

నిజంగా దళిత సంఘాలకు. దళిత నాయకులకు ఈ వ్యవస్థను పరిమార్చాలని కోరిక వుందా? వుంటే, వీళ్ళు దాని కనుగుణంగా నడుస్తున్నారా? దర్శన్ సంగతి. అట్లా వుంచుదాం. ఇక్కడ వీళ్ళంతా వొకటిగా వుంటున్నారా? లేదని అందరికీ తెలుసు.

దళిత నాయకుల వ్యక్తిగత విషయాల నిక్కడ తడమవలసిన అవసరం లేదు గాని, వీళ్ళు చేస్తున్న పని తీరు చాలా భిన్నంగా వుంటుంది. ఉద్యమాలు కేవలం

సంపాదన కోసమే నన్నట్లుగా ఉద్యమాలను నడుపుతున్నారు. అందుకే బ్రాహ్మణీయ వ్యవస్థను కాపాడే పెద్దలు వీళ్ళను చూచి అదరుటలేదు, బెదరుటలేదు. ఏమైనా భయపడుతున్నారంటే ఓట్ల కోసమే.

ఇదేసమయంలో- వెనుకబడిన కులాలుగా ముద్ర వేయించుకొన్న మిత్రులు దళిత కులాలుగా పిలువబడుతున్న వాంతో తగాదాలాడుతున్నారు. ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గున మండే పరిస్థితి యేర్పడ్డది. ఇదంతా నేను ఆంధ్రదేశాన్ని దృష్టిలో పెట్టుకొనే రాస్తున్నా. మొత్తం దేశం సంగతి దీన్ని ఆధారంగా భావించ వచ్చు.

దళితులనబడే వాళ్ళ శాతం ఎంత? వెనుకబడిన కులాల శాతం ఎంత? ఇద్దరూ కలవవద్దా? కలవకుండా బ్రాహ్మణీయ వ్యవస్థను రూపుమాపుతారా? ఎందుకీ అఘాతం? ఈ విషయం దళిత నాయకులు గానీ, వెనుకబడిన కులాల నాయకులుగాని పట్టించుకొంటున్నారా?

దళితులంతా విడిగా వున్నారా? క్రైస్తవంలో జేరిన వాళ్ళెంతమంది? మరి యమ్మ జాతరకు క్రైస్తవ మిషన్ మహాసభలకు జనం దళితులే తండోపతండాలుగా వెళుతున్నారే? వాళ్ళ సంగతేమిటి? జ్యోతిరావుపులే సంగతి, అంబేద్కర్ సంగతీ గమనించిన- కనీసం వాళ్ళు చేసిన చాకిరిని అర్థం చేసుకొన్న దళితులెంతమంది? క్రైస్తవ ప్రవాహాన్ని ఆపకుండా ఏమైనా చేయగలమని పగటి కలలు కంటున్నారా? అసలు క్రైస్తవ మిషనరీ సాయం లేకుండా నడిచే దళిత సంఘాలెన్ని? వాళ్ళ సాయం లేకుండా ఉద్యమాలను నడిపే దళిత నాయకు లెంతమంది? వీటిని ఆలోచించ వద్దా?

దళితుల తాత్త్విక భూమిక ఏమిటి? తాత్త్విక భూమిక లేకుండా ఉద్యమాలు చేస్తారా? అది సాధ్యమా? వీళ్ళకొక తాత్త్వికాయుధం వుంటే దాన్ని దళితుల్లో ప్రచారం చేస్తున్నారా? ఇవన్నీ ఆలోచించ వలసిన విషయాలు.

ఏ జెండా మోసినా, ఏ ధర్మాన్ని పాటించినా దళితుడైతే చాలునా? అతడు మన వాడేనా? భావ సారూప్యం లేకుండా ఏదైనా సాధ్యమా? అందుకాచోట ఓ నవ యుగ కవి చక్రవర్తి "వీడు మన వాడా కాదా అను అనుమానము తీరకున్న అజ్ఞభవుని అబ్బను కూడా లక్ష్యపెట్ట" రన్నాడు. ఇందులో చాలా వాస్తవముంది. ఏ వ్యవస్థను ఆధారం చేసుకొని మన వాడంటున్నామో గూడా ఆలోచించవలసిందే.

అందుకే ఏ సిద్ధాంతాన్ని, ఏ రాజకీయ పార్టీని ఆధారం చేసుకొని బ్రతుకుతున్నా మన అనే దానితో అతనికి జేజేలు పలుకుతున్నాం. అంతేగాని దళితుడైతే దళిత భావం వుందా? లేదా? అని ఆలోచించం. ఆలోచించవలసిన పని కూడా లేదను కొంటారు ఆ సంఘ నాయకులు.

దళితులని బ్రాహ్మణీయ సమాజంలో పిలువబడే మిత్రుల్లో పరస్పరం సాంస్కృతిక అగాధం వుంది; వెనుకబడిన కులాల మిత్రుల్లో పరస్పరం సాంస్కృతిక అగాధం వుంది. అట్లాగే దళితులకూ, వెనుకబడిన వారికి మధ్య సాంస్కృతిక అగాధం వుంది. ఈ గోతుల్ని పూడ్చకుండా పరస్పరం వాళ్ళను కలుపుతారా? ఇది సాధ్యమా? పనిచేసే మిత్రులు దీన్ని అర్థం చేసుకొన్నారా? ఈ గుంటల్ని పూడ్చటానికి ఏ సాధన సామాగ్రి నుపయోగిస్తారు?

చివరిగా :

కుల వ్యవస్థ చాలా భయంకరమైనది. ఇది ప్రపంచంలో ఎక్కడా లేని వ్యవస్థ. ఆర్యులీ నేలపై బహుజనుల్ని కలవకుండా చేసిన వ్యవస్థ.

జాతి భేదం గానీ, తెగ భేదం గానీ, బానిస సమాజం గానీ ఏదీ దీనితో పోల్చరానిది. అవన్నీ చలన సహితాలు ఇది చలన రహితం.

పుట్టుకతోటే గౌరవాన్ని, ఉచ్ఛ, నీచాలను అంటగడుతుంది కులవ్యవస్థ. ఆర్యుల సృష్టి ఈ సమాజం. ఆర్యుల రాకకు పూర్వం ఇట్లాంటి వ్యవస్థ మనకులేదు

ఆర్య ధర్మాన్ని అంతమొందించాలి: మను ధర్మాన్ని మంటగలపాలి. కౌటిల్య రాజ్యాన్ని కాలధర్మం చెందించాలి. ఈ పని చేయకుండా దేశీయ వ్యవస్థను పునర్నిర్మించలేము.

కులంలేని హిందూమతాన్ని నిర్మిస్తామని హిందూ మతస్థులు చెపుతున్నారు. దళిత బహుజనులు దాదాపుగా హిందూమతం లోనో, క్రైస్తవమతం లోనో వున్నారు. ఈ రెండూ చాలా ప్రమాదకరమైనవి.

అంబేడ్కర్, పెరియార్, జ్యోతిరావుపులే, వేమన, బౌద్ధులు, లోకాయతులు మొదలైనవాళ్ళు మార్గదర్శకంగా ఉద్యమాన్ని చేపట్టాలి. 11, 12 శతాబ్దాలలో వీరశైవం తక్కువ పనేమీ చేయలేదు. బ్రాహ్మణవాదాన్ని చావుదెబ్బ కొట్టటానికి దళితోద్యమంలో పనిచేస్తున్న మిత్రులు దీన్ని గమనంలోకి తీసుకోవాలి

ఇంతవుముందు హక్కులకోసం, కుల వ్యతిరేకతను ప్రదర్శించటం కోసం బ్రాహ్మణవాదాన్ని నామరూపాల్లేకుండా చేయటం కోసం ఉద్యమాలెన్నో వచ్చాయి. వాటి ఫలితంగా రకరకాల రాయితీలు దళితులకూ, బహుజనులకూ సంక్రమించేట్టు చేశారు బ్రాహ్మణవాదంతో విభేదించే పెద్దలు.

జాతీయ స్థాయిలో దళితోద్యమం తలయెత్తినా వొరిగేదేమీ లేదు. అట్లా అని నిరుత్సాహపరచటం గాదు. బ్రాహ్మణవాదం చాలా ప్రమాదమైందని హెచ్చరించటం కోసమే

ఒక్క లోకాయతం దప్ప తక్కిన బ్రాహ్మణేతరోద్యమాలన్నీ బ్రాహ్మణ వాదం ముందు తలవొంచక తప్పలేదు. నిన్న గాక మొన్న తలయెత్తిన ద్రవిడ కజగం మాట ప్రత్యేకించి చెప్పవలసిందేమీ లేదు.

బౌద్ధం సనాతనీకరించబడ్డది. వీరశైవం కులమయమై బ్రాహ్మణవాదానికి సలాము కొట్టింది. అందుకే దాన్ని జాగ్రత్తగా గమనించమంటున్నాం. మిత్రులీ విషయాన్ని గమనిస్తారని ఆశిస్తా.

వెలువడింది

జ్యోతిష్యం శాస్త్రమా?

రచన :

రామకృష్ణ

తల్లిభాషలో చదువుకొందాం

జూన్ నెల వచ్చింది. విద్యా సంస్థలకు సెలవులయిపోయాయి ప్రైవేటు విద్యా సంస్థలు పోటీపడి ప్రచారం అన్ని రకాలుగా చేస్తూ తెరవబడుతున్నాయి. చాలా రకాలుగా తిప్పలుపడి వున్నవాళ్ళు, లేనివాళ్లు తమ పిల్లల్ని విద్యాసంస్థల్లో చేరుస్తున్నారు తమనేదో వుద్ధరిస్తారని నిజంగా తమ విద్యాసంస్థలే మీ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతాయని అందరూ నిస్సిగ్గుగా ప్రచారం చేసుకుంటున్నారు. నిస్సిగ్గుగా అని దేనికంటున్నామంటే, ఉద్ధరించటమంటే ఏమిటో ఈ మాటలన్న వారికి తెలియదు కనుక.

ఇంగ్లీషు మీడియం, తెలుగు మీడియం అంటూ హోరెత్తిస్తారు. మమ్మీ, డాడి చదువులకు నిరక్షరకుక్షులైన తల్లిదండ్రులు కూడా ఎగబ్రాకటం చూస్తాం. అంధ పరంపరగా చదువుకొన్న వాళ్ళను, చదువుకోని వాళ్లు అనుసరించటం చూస్తాం.

ఇక 10వ తరగతి పాసై కాలేజీలకు వెళ్ళే వాళ్ళు కాలేజీల వద్ద సీట్ల కోసం బారులు తీరి నిలబడతారు. ఎవరి అప్లికేషన్ చూద్దామన్నా రెండవ భాష సంస్కృతమనే రాసి వుంటుంది. ప్రైవేటు సంస్థలైతే మరీ చెప్పే పని లేదు.

10వ తరగతి లోపల ప్రతి పల్లెటూళ్లో గూడా ఇంగ్లీషు కాన్వెంటులూ, కొంచెం ఒక మోస్తరు గ్రామాల్లో, మండల కేంద్రాల్లో, పట్టణాల్లో, నగరాల్లో ఇంగ్లీషు మీడియం హైస్కూళ్ళు, కాలేజీలు తామరతంపరగా వున్నాయి. ఇంగ్లీషు చదువుకోటమే చదువుకోవటమంటే, తెలుగు చదువుకోవటం చదువు కాదు.

అట్లాగే 10వ తరగతి తరువాత రెండవ భాషగా ఇప్పుడు సంస్కృతం తప్ప తెలుగు చదివే విద్యార్థులే కరువయ్యారు. ఆడ, మగ అందరూ సంస్కృతమే. చదువుతున్నారు, మార్కులు విపరీతంగా వస్తాయి మొత్తం మార్కుల్లో యివి కలుస్తాయనే తాపత్రయం.

మారుమూల పల్లెటూళ్లో గూడా, నిరక్షరాస్యులైన తల్లిదండ్రులు కూడా తమ

బిడ్డలకు ఇంగ్లీషు మీడియం తప్ప, తెలుగు చదివించటం తక్కువతనంగా, నామూషిగా భావిస్తున్నారు.

రాగాపోగా 10వ తరగతి లోపలగాని, 10వ తరగతి తరువాత గాని తెలుగు చదివే విద్యార్థినీ విద్యార్థులే లేరు. ఇంతేగాక, తెలుగు తల్లి కడుపున బుట్టి నాలుగైదు సంవత్సరాలు విదేశాలలో వున్నవారు "మేం తెలుగును మరచిపోయాం" అని 'సిగ్గూ శరమూ' లేకుండా చెపుతారు, అది వాళ్ళ గొప్పతనానికి తార్కాణమో? తెలివి తక్కువతనానికి నిదర్శనమో?

మొత్తం మీద తెలుగును చదివే వాళ్ళే లేరు. హైస్కూలు స్థాయి వరకు మొదటి భాషగా వున్నా, కాలేజీ స్థాయి నుంచి తెలుగు ద్వితీయ భాష, పరాయి భాషయైన యింగ్లీషు మొదటి భాష. ఇది తెలుగు దేశమా? ఆంగ్ల దేశమా?

తెలుగు బాస తెలుగు రాష్ట్రంలో రెండో భాషగా, అదీ యిష్టమైతే తెలుగు చదువుకోవచ్చు; లేదా సంస్కృతం, హిందీ మరే యితర భాషనైనా చదువుకోవచ్చు. ఇదీ మనం మన భాషకిస్తున్న గౌరవం. అంటే తల్లి తన యింటిలోనే పరాయిదన్నమాట తెలుగును మొదటి భాషగా, తెలుగు మాధ్యమికం దప్ప ఇంగ్లీషు తదితర భాషల్ని ఐచ్చిక భాషలుగా వాడుకోవచ్చు ఈ విషయం అటు ప్రభుత్వంగానీ యిటు అధికార భాషా సంఘంగానీ, చదువుకున్న మేధావులు గానీ ఆలోచించక పోవటం శోచనీయం. చింత్యం

ఇట్లాగే సాగితే సుసంపన్నమైన, దేశభాషల్లో లెస్సగా పేరుగాంచిన, ప్రపంచంలో మేటియైన తెలుగు పాషా ప్రాంతం భాషా ఎడారిగా మారక ఏమవుతుంది? దీన్ని గమనించకపోతే, రాగల ప్రమాదాన్ని గుర్తించకపోతే తొందరలనే అటు ప్రభుత్వము, ఇటు మేధావులూ చిక్కుల్లో పడక తప్పదు.

తెలుగు బాస గొప్పదనం :

తెలుగు బాస సొంత దేశంలోనే యింత అవమానానికి గురికావటానికి కారణమేమిటి? ఇదేమన్నా మంచి బాస కాదా? సమగ్రమైనది కాదా? దీనికి ప్రాచుర్య ప్రాచీనత లేవా? ఇంకా ఏమైనా కొరవడ్డవా?

అదేంకాదు; తెలుగుబాస చాలా ప్రాచీనమైనది. ఒక్కముక్కలో చెప్పాలంటే చచ్చిన దానికి ఊపిరి పోయాలనుకుంటున్న సంస్కృతం కంటె ప్రాచీనమైనది.

ఎంతో సాహిత్యం వున్నది. ఏభై నాలుగు, కొందరి దృష్టిలో ఏభై ఆరు అక్షరా లున్న కలికి తెలుగు. ప్రపంచంలోని ఏ భాషా పదాన్నైనా, ఎంత క్లిష్టమైన ఉచ్ఛారణ కలదాన్నైనా పలకగల వాడు ఒక్క తెలుగు నేర్చిన వాడే తెలుగు వాడే. ఇంత సమగ్రమైన, సంపన్నమైన, మృదుమధురమైన, మంజుమనోహరమైన, స్నిగ్ధ గాంభీర్యమైన తెలుగును ఎందుకు సొంతగడ్డలోనే పరాయి భాషగా వాడుతున్నారో అర్థంకావటం లేదు.

తెలుగు సమగ్రమా ! అసమగ్రమా !

తెలుగు భాషకు అక్షరాలు ముప్పై అరు సంస్కృతాక్షరాలు కలిస్తే అది ఆంధ్ర మవుతుంది. ఆంధ్ర భాషకు అక్షరాలు ఏభై ఆరు.

ఏభై ఆరు అక్షరాలున్న భాష సమగ్రమైంది కాక, ఇరవై ఆరు అక్షరా లున్న భాష సమగ్రమవుతుందా?

అందుకే కృష్ణరాయలు-

"దేశ భాషలందు తెలుగు లెస్స" అని చెప్పాడు.

అదీగాక నిన్న మొన్నటి జాషువా ప్రపంచ సౌందర్యాన్ని వొలికించే తాజ మహలు సౌందర్యాన్ని వర్ణిస్తూ-

"ఏబదా రక్షరమ్ముల ఎసక మెసగు
కలికి భాషకు తెలుగు నకలవి గాక,
అలవి యే తాజిసోయగం బభినుతింప
తదితరంబైన భాషా వితానమునకు" అని శ్లాఘించాడు తెలుగును.

తెలుగు నదులకూ, రాళ్ళకూ, రప్పలకూ ప్రాణం పోసిన భాష, ఒక్క వసుచరిత్ర చాలు తెలుగు గొప్పదనాన్ని చాటటానికి.

వసుచరిత్ర సంస్కృతం లోకి, ఇంగ్లీషులోకి తర్జుమా చేయబడ్డది. దీనితో సమానంగా ఏ భాషలోనూ, ఎవ్వరూ వ్రాయలేరు. అంటే, ఆ భాషలు అంత సమర్థమైనవి గావు.

మానవుడు నవరస భరిత హృదయుడు. నవరసాలను మృదుమధుర, కోమల మంజుమంజితమైన తెలుగు అభివ్యక్తం చేయలేదనేది బ్రాహ్మణ పండితుల

వాదన. కాని దాన్ని కాదని పరుషరంజితమైన తెలుగులో క్రోధ రసాన్ని అభివ్యక్తీకరించి, తెలుగు సర్వ సమగ్రమైన భాష అని ఋజువు చేశాడు తిక్కన.

కృష్ణుడు రాయబారానికి వెళ్ళే సందర్భంలో ద్రౌపది నిండు సభలో తనను ఈడ్చిన సంగతినీ, దుశ్శాసనుడు జుట్టుపట్టుకొని ఈడ్చిన సంగతిని తెలియజేస్తూ చెప్పింది.

"ఇవి దుస్ససేను వ్రేళ్ళం
దవిలి సగము ద్రెస్సిపోయి తక్కిన యివి, తీ
రు మాటల
అవసరమున తలప వలయు సచ్యుత వీనిన్

దీనిని బట్టి తెలుగు సర్వ సమగ్రమైందని, ఏ రసాన్ని పోషించాలన్నా అందుకు తగినదేనని ఋజువు చేశారు.

తెలుగులో శాస్త్ర గ్రంథాలు :

ఈనాడు శాస్త్రయుగం, అణుయుగం, కంప్యూటర్ యుగం. తెలుగు దీనికి పనికివస్తుందా? అని తెలుగువాళ్ళే ప్రశ్నించుకొంటున్నారు.

ఈ ప్రశ్న ఈనాటిది కాదు. చాలా కాలం నాటిది. మాతృభాషలో విద్యాబోధన జరగాలంటే, శాస్త్ర సాంకేతిక రంగాలలో భాష అభివృద్ధి చెందాలి గదా! అందుకే తెలుగులో గాకుండా, ఇంగ్లీషులో అన్ని శాస్త్రసాంకేతిక గ్రంథాలున్నాయి కాబట్టి ఇంగ్లీషు మీడియంలో చదువుకోవటం అవసరమంటున్నారు కొందరు మేధావులు. ఇది నిజమా?

కాదని ముమ్మాటికీ చెప్పవచ్చు. పొరుగు రాష్ట్రాలలో ఏం జరుగుతుందో గమనించాలి. పొరుగుల సంగతి ఎట్లా వున్నా, మన భాష దానికి సమర్థమౌనా కాదా అనే సంగతి కూడా గమనించాలి.

ఆధునిక విజ్ఞానం ఇంగ్లీషులో ఎక్కువగా వస్తున్న మాట నిజమే. ఈ విషయాన్ని తోసిరాజనలేము. కాని, దేశ భాషలు కూడా ఆధునిక విజ్ఞానాన్ని తమలో ఇముడ్చుకోగలవు, అందులో తెలుగు తప్పకుండా ఇముడ్చుకొంటుంది.

ఆధునిక శాస్త్రాలు- సైన్సు ఇంజనీరింగు, వైద్యం మొ॥న గ్రంథాలు ఇంగ్లీ

షలో వుండటానికి కారణమేమిటి? మొదట్లో ఆ భాషలో ఆయా శాస్త్రాలు వ్రాయబడ్డాయి. అందుకని ఆపేర్లు ఆ భాషలో స్థిరపడ్డాయి.

వాటిని తెలుగులోకి తీసుకొని వచ్చేటప్పుడు- సాంకేతిక, శాస్త్రీయ పదజాలాన్ని ఉన్నవాటిని ఉన్నట్లుగా తెలుగులోకి తెచ్చుకొని, తక్కిన విషయాన్ని మన భాషలోకి అనువదించవచ్చు.

అట్లుగాకుండా, శాస్త్ర, సాంకేతిక పదజాలాన్ని కూడా ప్రచుర ప్రచారంలో వున్న మన భాషలోకి వాటిని తీసుకొని రాయవచ్చు.

అంతేగాకుండా, సమర్థులైన పండితులు ఆయా విషయాలలో నిష్ణాతులుంటే అందరికీ అర్థమయ్యే రీతిలో క్రొత్తగా తెనుగు చేయవచ్చు. వీటిల్లో మొదటి పద్ధతి మేలుగా వుంటుంది. లేదా రెండో పద్ధతి కొంతవరకు ఫరవాలేదు.

ఉదా :- బస్సు అనే పదం అందరికీ తెలుసు కాబట్టి బస్సు అనే మన భాషలోకి వాడుకోవచ్చు. ఇట్లాగే తక్కిన వాటిని గ్రహించాలి. అంతేగాక, రైలు వుంది దీన్ని పొగబండి అంటారు కొందరు దేశీయులు. దానినట్లా తీసుకొని వాడవచ్చు. అట్లాగే సిగ్నల్ అనే పదాన్ని రెక్క అని వాడతారు. సిగ్నల్ ఇచ్చారు అనే దానిని రెక్క వంగింది అనటం సామాన్యుల భాషలో వింటాం. ఇట్లాంటి వాటిని వాడుకొంటాం

అంతేగాని, తల్లి భాషను అగౌరవపరచి. ఇంగ్లీషు భాషలో చదువుకొనే దుర్గతికి దిగజారకూడదు. దీనివల్ల దేశభాషలు అభివృద్ధి చెందవు. సరికదా- అడుగంటే ప్రమాదముంది.

మాతృభాషలో విద్యా బోధన :

విద్యా బోధన మాతృభాషలోనే జరగాలనేది ప్రపంచ విద్యావేత్తల అభిప్రాయం. ప్రాథమిక విద్య నుంచి విశ్వవిద్యాలయాల స్థాయి వరకూ మాతృభాషలోనే చదువు సాగాలి. శారీరక మూర్తిమత్వం, మానసిక మూర్తిమత్వం జరుగుతాయి. అంటే. మనకు తెలుగులోనే విద్యాభ్యాసం కొనసాగాలి. పరాయిభాషలో గాదు ఇంగ్లీషులో నిజంగా ఎంత యిబ్బందిపడాలో అనుభవంతో వాస్తవం చెప్పగలగాలి అందులో భావం, ఉచ్చారణ, స్పెల్లింగ్ మొత్తం క్రొత్త కాబట్టి అన్నీ నేర్చుకోవలసిందే

మాతృభాషలో ఆ బాధ తప్పుతుంది కేవలం భావం మాత్రం నేర్చుకొంటే సరిపో తుంది.

మానసిక వత్తిడికి నేటి విద్యార్థులు గురౌతున్నారని అంతా చెపుతున్నారు. కాని ఆ విషయం పట్టించుకోనే నాథుడే లేడు ఎన్ని ఆత్మహత్యలు జరుగుతున్నాయో వాళ్ళ తల్లిదండ్రులకు తప్ప ఇంకెవరికి తెలుస్తుంది.

సొంత భాషలో విద్యార్థినీ విద్యార్థులు ఏ వత్తిడికీ లొంగకుండా చదువు కొంటారు.

ద్విభాషా, త్రిభాషా, చతుర్భాషా సిద్ధాంతాలు :

మనదేశంలో చదువుకొనే విద్యార్థినీ విద్యార్థులు మాతృభాష, రాజభాష, ఇంగ్లిషు తప్పనిసరిగా నేర్చుకోవాలి.

హిందీ ప్రాంతం వాళ్ళయితే, హిందీ మాతృభాష గనుక దానితోపాటు ఇంగ్లిషు నేర్చుకుంటారు. వాళ్ళకు ద్విభాషా సిద్ధాంతం సరిపోతుంది.

హిందీ యేతర ప్రాంతం వాళ్ళు మూడు భాషలు నేర్చుకోవాలిసిందే. ఒక మాతృభాష, రాజభాషగా హిందీ, ఇంగ్లిషు నేర్చుకోవాలి. అంటే త్రిభాషా సిద్ధాంతం హిందీ యేతర ప్రాంతం వాళ్ళకు వర్తిస్తుందన్న మాట.

హిందీ ప్రాంతీయులైనా, కాకపోయినా ఓరియంటల్ చదువు చదువుకొంటే వాళ్ళకు ఇంకో భాష అదనంగా అంటుకొంటుంది.

మాతృభాష, సంస్కృతం, ఇంగ్లిషు ఈ మూడు హిందీ ప్రాంతీయులకు, మాతృభాష, హిందీ, ఇంగ్లిషు, సంస్కృతం నాలుగు భాషలు హిందియేతర ప్రాంతీయులకు అంటే మనం తెలుగు, హిందీ, ఇంగ్లిషు, సంస్కృతం నాలుగు భాషలు ఆరవ తరగతి నుండే నేర్చుకోవాలి.

ఇది ప్రపంచంలోని ఎనిమిదవ వింత.

విద్యార్థినీ, విద్యార్థులకు పద్నాలుగేళ్ళు నిండేదాకా రెండో భాషను పరిచయం చేయగూడదని విద్యావేత్తలంటారు. ఆ భావాన్ని మనం ఏనాడో తుంగలోదొక్కాం విద్యా వ్యాపారం జోరుగా సాగుతున్న ఈ రోజుల్లో ఈ మాటంటే నవ్వులాటగా వుంటుంది. అందుకే. నడవటానికి వీలయ్యే వయస్సు వస్తే పిల్లల్ని కాన్వెంటు జైలు

కు తల్లిదండ్రులే తరలిస్తారు. చిన్నతనం నుండే వాళ్ళకు తెలుగు వచ్చినా, రాక పోయినా పరవాలేదు గాని. మమ్మీ డాడి అనటం రావాలి. ఆ పైన హిందీ రావాలి. ఇది తల్లిదండ్రుల కాంక్ష. విద్యా వ్యాపార సంస్థల అభిరుచి. ఆ అంగట్లో ఆ సరుకులే విదేశీ సరుకులు దప్ప, మాతృభాషా సరుకు అమ్మడు పోదు.

ఎవరైనా తెలుగుమీడియం స్కూలు పెడితే, తెలివితక్కువ వాడి క్రింద లెక్క. తొందరలోనే అతడు ఆ స్కూలును మూసుకోవాలి.

ఇంగ్లీషులో ఆ భాషా పదాల శాతమెంత ?
ప్రపంచంలో ఇంగ్లీషు వచ్చిన వాళ్ళ శాతమెంత ?

ఈనాడు ఇంగ్లీషు వ్యామోహంలో పడి మాతృభాషలను గూడా మరచి పోతున్నాం ఇంగ్లీషు భాషా పదసంపద యెంతో తెలుసుకొన్నారా? గ్రీకు, లాటిన్ మొదలైన భాషా పదాల శాతం ఆ భాషలో ఎక్కువ. అంతెందుకు తెలుగుపదాలు కూడా ఆ భాషలో చేరినయ్యంటే మీకు వింతగా వుంటుందేమో?

ఏ భాషకైనా అదాన ప్రదానాలుంటాయి. ఇవన్నీ లెక్కదీస్తే, అసలు ఇంగ్లీషు భాషలోని పదాల శాతం 5 కంటె మించదు. మరి యింతగా ఆ భాష పెరిగిందేమిటి? దీనికి కారణం ఆదాన ప్రదానులు. అందుకే తెలుగును కూడా పెంచాలి అంటే ఆ భాష గూడా తన భాషలోకి యితర పదాలను తెచ్చుకోవటం, ఇతరాలకు తన భాషా పదాలనీయటం అవసరం. దాన్నే మనం ఆదాన ప్రదానం అంటాం. ప్రపంచంలో ఏ భాషయైనా పెరిగేది వీటి వల్లనే.

ఇంతేగాక, ఇంగ్లీషు మాట్లాడె వాళ్ళ శాతం ప్రపంచ జనాభాలో ఎంత వుంటుందని భావిస్తున్నారు? ఒక్క ఇండియాలోనే, అదీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోనే ఇద్దరు తెలుగు వాళ్ళు కలిసినా వచ్చీరాని యింగ్లీషులో మాట్లాడుకోవటం జరుగుతుంది. ప్రపంచంలోనే అందమైన భాష తెలుగు భాష. తమ భాషలో మాట్లాడుకోవటం సిగ్గుగా భావిస్తారు.

ప్రపంచ మేధావులలో వాళ్ళ మాతృభాషలోనే పాండిత్యం వుంటుంది. ప్రొఫెసర్లు గాని, యితర మేధావులు గాని తమ మాతృభాషలోనే పాండిత్యం సంపాదిస్తారు. అంతేగాని, మన లాగా గొడ్డు కాచుకొనేవాడి దగ్గర నుండి మేధావుల (వాస్తవానికి వీళ్ళంతా మేతావులే) మని విర్రవీగే వాళ్ళ వరకు మాతృభాష నేర్వని పిచ్చివాళ్ళు గాదు.

BCI

అందుకే లోహియా లాంటి వాళ్లు ప్రపంచంలో ఇంగ్లీషు మాట్లాడే వాళ్ళు శాతం ౫ మాత్రమేనని గణాంక వివరాలిచ్చారు. దీనికోసం మనం మాత్రమే వెంపరలాడతాం ప్రపంచంలో యితర భాషల వాళ్లు ఇంతగా వెంపరలాడరు,

ఇతర ప్రాంతాలకు వెళ్ళే వాళ్ళకు ఇంగ్లీషు కావాలి కదా :

ఇంగ్లీషు మీడియం చదివే వాళ్ళు పిల్లలు గానీ, వాళ్ళ తల్లిదండ్రులు కానీ చెప్పే కొంటె సమాధానం- ఇతర ప్రాంతాలకు వెళితే భాషా సమస్య తలెత్తుతుంది గదా! అందుకని ఇంగ్లీషు మీడియం కావాలంటారు. "తాడిచెట్టు ఎందుకెక్కావురా! అంటే, దూడ మేత" కన్నాట్ట వొకడు.

మాతృభాష పదలి రిషా లాగే వాడి దగ్గర నుండి అత్యంత మేధావులుగా చెప్పుకొనే వాళ్ళంతా, వాళ్ళ పిల్లలు గూడా ఇతర ప్రాంతాలకు వెళ్ళి IAS, IPS ఇంకా ఇతర ఉద్యోగాలు చేస్తారా? వాళ్ళు ఇంగ్లీషు మీడియం అయితే తప్ప యితర ప్రాంతాలకు పోతే ఇంగ్లీషు రాదా? ఇది నిజమా?

పచ్చి అబద్ధం. ఇంగ్లీషు ఐచ్ఛిక భాషగానో, నిర్బంధ ద్వితీయ, తృతీయ పాఠ్యభాగం గానో చదివితే సరిపోతుంది. మాతృభాషలో పాండిత్యం వుంటే ఏ భాషనైనా నేర్చుకోవటానికి రెండు నెలలు, మూడు నెలలు సరిపోతుంది. దీనికోసం మాతృభాషనే మరచిపోయి ఇంగ్లీషు మీడియంను ఆశ్రయించవలసిన దౌర్గత్యం లేదు. అందుకని ఆ మాట చెపితే నమ్మటానికి వీల్లేదు.

ఈనాడు IAS, IPS పరీక్షలు గూడా మాతృభాషల్లో పెడుతున్నారు గదా! అట్లాంటప్పుడు ఇతర ప్రాంతాలకు ఎట్లా వెళతారు? ఇదంతా బూటకం కాదా?

సంస్కృతం సంగతేమిటి ?

ఇంగ్లీషును గురించీ, ఇంగ్లీషు మీడియం గురించీ కొంచెం చెప్పుకొన్నాం. ఇక సంస్కృతం గురించి గూడా చాలా క్లుప్తంగా చెప్పుకొందాం.

ఇంగ్లీషు మీడియం చదివే వాళ్ళు చెప్పే కారణాలకు, 10వ తరగతి తర్వాత సంస్కృతం చదివే వాళ్ళు చెప్పే కారణాలకు సంబంధం లేదు. అయితే, యిద్దరూ మాతృభాషయైన తెలుగును మాత్రం దూరంగా నెడుతున్నారు. ఈ విషయంలో ఇద్దరికీ ఏకాభిప్రాయం వుంది.

[సశేషం]

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA106M126
పుస్తకం పేరు	చార్వాకం
తారీఖు	07 February 2025
ముందు అట్ట	YES
వెనుక అట్ట	YES
మొత్తం పేజీలు	37
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	P. Jayamma
పేజీలు విడదీసినది	P. Jayamma
స్కాన్ చేసినది	[illegible]
పరీక్ష చేసినది	AMRUTHA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	[illegible]